POSTAL REGD.NO.PRAKASAM/16/2021-2023
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
జూలై 2022
వెల – ₹ 10.00

సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 40 సంచిక: 03





ఈ నెల పండుగలు

జూలై 04 - శ్రీ స్వామి వివేకానంద ఆరాధన
జూలై 13 - శ్రీ గురు పూర్ణిమ
జూలై 26 - శ్రీ స్వామి వివేకానంద ఆరాధన (తిథి - ఆషాఢ బహుళ త్రయోదశి)

"సాధనకంతటికీ మూలం ఒక్కటే. ఏ పంచభూతాలచేత మన దేహాలు చేయబడతాయో అవి అన్ని దేహాల్లోనూ ఒక్కటే. చైతన్యము ఒక్కటే. అయినా, 'అజ్ఞానం' అను, 'మాయ' అను; దాని కారణంగా ఒక దేహంలో, మరో దేహంలో, దేహి వేరుగా వున్నట్లు నమ్మి జీవితాన్ని, ద్వంద్వాలనీ, సర్వాన్నీ ఏర్పరుచుకుంటాం. ఈ యథార్థం తెలియటం తనలోని పంచభూతాలను గురించి నిశితంగా చింతన చేస్తే అందులో 'నా' అనేందుకు, 'నేను' అనేందుకు ఏమీ మిగలదు. అలానే చైతన్యంలోనూ మిగలదు. ఈ తీవ్ర విచారణ చేస్తే వచ్చిన ఆ నిశ్చయం మనస్సులో వికారాలకు తావివ్వనివ్వదు. అప్పుడంతటా ఒక్కటే అన్నది స్థిరమై గమ్యం చేరుతుంది. తిరిగి భ్రమలో పడనివ్వకుండా మనం అనుక్షణం మెలకువగా వుంటే కొంతకాలానికది సహజం అవుతుంది. తెంపు లేకుండా ఈ భావంలో వుండడమే తపస్సు,దీక్ష. "

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

భుక్తీ ముక్తీ చేకూర్చే శ్రీ గురుచంద్రుడు సాయి

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

సాధకులందరూ తమ తమ గురువులను పూజించుకొనే పర్వదినం గురుపూర్ణిమ. ఆసేతుహిమాచల పర్యంతమూ మన సంస్కృతి కంతటికీ మూలపురుషుడైన వేదవ్యాస మహర్షిని సర్వులూ పూజించుకొనే పర్వదినం. ఆయన సకల వేదాంత సారమయిన బ్రహ్మసూత్రములను వ్రాయడానికి ఉపక్రమించిన శుభదినం 'గురు పూర్ణిమ'. తరువాత చాలాకాలమునకు స్వతంత్ర్యమయిన ఆత్మపరిశీలన వలన ఆయన నిర్వచించిన ఆత్మపథము సర్వ సంపూర్ణమని మనకు తెలిసేలా తాను కనుగొని, పరిపూర్ణుడై లోకమునకు బుద్ధ భగవానుడు వారణాసి పట్టణం వద్ద తన ధర్మముగా, బుద్ధధర్మంగా, ప్రబోధించ నారంభించిన పర్వదినము 'గురు పూర్ణిమ'.

ఈ పర్వదినమునకు 'పూర్ణిమ' నెన్నుకొనడంలో ఒక విశిష్టత వున్నది. ఋషులు ప్రవచించిన జ్యోతిషశాస్త్రం ప్రకారము శరీరమునకు మూలమైన తత్వము భూమి. భూమినుండి సారభూతముగా ఉత్పన్నమయిన అన్నము వలన వుత్పన్నమయి, అన్నము వలన వృద్ధి నొంది, భూమిపై జీవించి, తరువాత మృతినొంది, భూమిలో లయించేది శరీరం. కనుక శరీరమునకు మూలం భూమి.

చంద్రుడు మనఃకారకుడు. "చంద్రమా మనసో జాతః" 'పరమేశ్వరుని మనస్సు నుండి చంద్రుడుద్భవించెను' అని శృతి చెప్పినది. మనస్సు స్వయం ప్రకాశమయినది కాదు. ఆత్మయొక్క చైతన్యమును గ్రహించి, ప్రతిబింబించడం వలన భాసించునది మాత్రమే. ఆహారము నుండి గ్రహించబడిన సారములోని సూక్ష్మమయిన తత్వమయిన మనస్సు - వివిధ కళలతో, మార్పులతో భాసిస్తుంది. దానికి ప్రకాశమును ప్రసాదించవలసినది స్వయం ప్రకాశమయిన ఆత్మయే. దానికి కారకుడు సూర్యుడని జ్యోతిష్యం చెబుతుంది.

స్వయంప్రకాశము, అన్నింటినీ గుర్తించేది, గుర్తింపజేయునది (అనగా సర్వసాక్షి) అయిన ఆత్మ, సామాన్యులకు పరోక్షము. ఇంద్రియ మనస్సులకు గోచరము కానిది. అంటే సామాన్యులయిన సర్వజీవులకు ప్రత్యక్షానుభవము, రాత్రివంటిది ఆత్మస్థితి, 'యా నిశా సర్వ భూతానాం' అని గీతాచార్యుడు చెప్పినట్లు సామాన్యులయిన జీవులందరికీ రాత్రివలె గుప్తమయిన ఆత్మస్థితి యోగులకు మాత్రమే మెలకువ వలె ప్రత్యక్షానుభవము. అటువంటి పూర్ణయోగుల మనస్సుకు పూర్ణిమ చంద్రుడు చక్కని పోలిక.

పూర్ణిమ నాటి చంద్రుడు సూర్యునినుండి వెలుగును సంపూర్ణముగా గ్రహించి చల్లదనము, ఆహ్లాదములతో కలిపి సర్వజీవులకూ ప్రతిబింబించినట్లే, రాత్రివంటి అజ్ఞానాంధకార బంధురమయిన, భయంకరమయిన సంసారిక జీవితంలో పున్నమి వెన్నెలవంటి భక్తి, వివేకము, అభయము ఆ యోగి ప్రసాదిస్తాడు- అతడు ప్రతిబింబించే

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:40 జూలై-2022 సంచిక:03

పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన 'సాయిబాబా'

విషయ సూచిక

01.	భుక్తి ముక్తి చేకూర్చేశ్రీ గురుచంద్రుడు సాయి	పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ	03
02.	పరిప్రశ్న	పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ	06
03.	మహాయోగి శ్రీ ప్రతాపకోటయ్య శాస్త్రిగారు	శ్రీమతి శ్రీదేవి	07
04.	రాధాకృష్ణ ఆయీ	పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ	09
05.	మాతృదేవి ప్రథమ ఆరాధనా మహోత్సవము	శ్రీమతి టి. పద్మావతి	10
06.	సచ్ఛిష్యుడు	పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ	13
07.	వార్తాలాపము	శ్రీమతి అడిదం వేదవతి	20
08.	మాతృదేవి స్మృతులు	శ్రీ టి. వి. రావు	21
09.	మార్గదర్శి	శ్రీ సూర్యప్రకాష్	22
10.	'ఆధ్యాత్మిక జాగృతి' గ్రంథ పరిచయం	శ్రీ ఎక్కిరాల ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్	24
11.	ద్వారకామాయి అనుభవమండపము	ఒక భక్తురాలు	26
12.	ఆచార్యుని అద్భుత లీలలు	శ్రీమతి అంజని	27

చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550

www.saibharadwaja.org
www.saimasterforums.org

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

విడి ప్రతి	:	రూ. 10-00
సంవత్సర చందా	:	రూ. 100-00

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

ఆ కాంతి అతడి హృదయము సంపూర్ణముగా అతని గురువుపై కేంద్రీకరింపబడి యుండటమే! పున్నమి చంద్రుని ముఖము సూర్యుని కాంతిని సంపూర్ణముగ గ్రహించినట్లు.

జ్ఞానములేని సామాన్యులలో సామాన్య చంద్రుని వృద్ధి క్షయములు బాల్య, కౌమార, యౌవన, వార్ధక్య మరణములనే దశలలో దేహంతోబాటు వృద్ధి చెంది, తిరిగి శిథిలమయ్యేదిగా, మనస్సు ఉంటుంది. కానీ నిశ్చల గురుభక్తుని మనస్సు క్రమంగా శుక్లపాడ్యమి నుండి పున్నమి వరకు వృద్ధిపొందే చంద్రుని కాంతిలా నానాటికీ గురుభక్తి వృద్ధిపొంది చరమదశలో పున్నమిచంద్రునితో నిలిచిపోతుంది. సంసారికులయిన జీవులమధ్య వెలుగొందే పరిపూర్ణ గురుభక్తుడయిన సద్గురుమూర్తి యొక్క అవతరణకు ప్రతీక పూర్ణిమ. మన మధ్య తన అవతారమును చాలించి కేవలం ఆత్మగా నిలిచిన గురుతత్త్వమునకు చిహ్నం - రాత్రియందు ఆ చంద్రునికి కాంతులు నిచ్చే పరోక్షుడయిన సూర్యుడు. అంటే శ్రీ సాయిని అనుగ్రహించి మనకు ప్రసాదించిన పరమాత్మ స్వరూపియయిన ఆయన గురువు పున్నమివెన్నెలకు మూలకారణమయి గుప్తంగా ఉండిపోయిన సూర్యుని వంటివాడు-- సాయి సేవించిన గురుస్థానంలోని ఆయన గురువు. అజ్ఞాన నిమగ్నులయిన మన మధ్య, సంపూర్ణమయిన ఆ గురువు అనుగ్రహమును తమ రూపములో మూర్తీభవింప జేసుకొని మనకు భుక్తిని, ముక్తిని ప్రసాదించే పున్నమి చంద్రునివంటివాడు సద్గురు చంద్రుడయిన సాయినాథుడు. మన హృదయములు గూడ నానాటికీ ఆయనయందు నిశ్చలమయిన భక్తియనే కళలను వృద్ధిపొందించుకుంటూ 'మన హృదయములలో కూడ గురుపూర్ణిమ యగుగాక!' అను సంకల్పంతో ఆయనను ఆరాధించుకొనే పర్వదినం గురుపూర్ణిమ.

వ్యాసపూర్ణిమ ప్రాశస్త్యం:- వేదవ్యాస మహర్షి లోకహితం కోరి వేదాన్ని నాల్గువేదాలుగా విభజించి, యీ కలియుగంలోని మందబుద్ధులకు, అల్పాయుష్కులకూ వాటి సామర్థ్య మర్థమయ్యేలా అష్టాదశ మహాపురాణాలు వ్రాశాడు. తర్వాత ముముక్షువుల కోసం వేదాంతసారమైన 'బ్రహ్మసూత్రములు' వ్రాశాడు. రానున్న (ఆషాఢ) పూర్ణిమ ఆయనను మన జాతీయంతా పూజించుకొనే రోజు 'వ్యాస పూర్ణిమ'. ఆ సేతుహిమాచల పర్యంతమూ యిన్ని ఆలయాలు, దేవతారాధన, భారతీయులకు తత్త్వదృష్టి ఉగ్గుపాలతో పెట్టిన విద్యయైనదంటే అంతటికీ ఆయనయే మూలకారకుడు. ఆయన అందుకే అవతరించాడు - "వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే". గురు పూర్ణిమనే, వ్యాసపూర్ణిమ అని గూడ అంటారు.

గురుపూర్ణిమ ప్రాశస్త్యం:- ఈయన మనకందించిన సనాతన ధర్మానికి వెన్నెముక బ్రహ్మజ్ఞానియైన గురువుకడ శరణుపొంది ఆయననుండి నాల్గుపురుషార్థాలు, వాటిని సాధించుకొనే మార్గము

తెలుసుకొనడం. అదే బ్రహ్మోపదేశంగా, భగవన్నామ సంకీర్తనము, భగవదవతార కథాశ్రవణముగా మనదేశంలో స్థిరపడింది. అర్జునుడు శ్రీకృష్ణుని శరణు పొందాడు. శ్రీకృష్ణుడు బోధించిన దానిలో ముఖ్యాంశం (భగవద్గీత 4:34)గూడ ప్రతి మానవుడు భగవత్స్వరూపియైన గురువు నాశ్రయించి వారినుండి జ్ఞానం పొందమనే. ఈ సంప్రదాయాన్ననుసరించి యీ వ్యాసపూర్ణిమ రోజున ప్రతివారు భగవత్స్వరూపమైన గురువును ఆరాధించడం ఆచారమై పూర్తిగా ప్రసిద్ధమైంది. అందుకే శ్రీ శిరిడీ సాయిబాబా గూడ తమ భక్తులతో గురుపూజ చేసుకోమని ప్రత్యేకించి హెచ్చరించిన పండుగ యిదొక్కటే!! ●



పరిప్రశ్న

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

ప్రశ్న:- పునర్జన్మ గురించి హిందువులతో మాట్లాడిన బాబా ముస్లింలతో ఎందుకు మాట్లాడలేదు?

- సుధామయి, విజయవాడ

జవాబు :- పునర్జన్మ ఉన్నా లేకున్నా మానవుడి కర్తవ్యమొక్కటే – ధర్మాచరణ. మనకు ఇతరుల వలన కల్గిన దుఃఖాలకు కృంగక, యితరులపై ద్వేషం పెంచుకొని మరలా కర్మ శృంఖలాలు తగిలించుకొనకుండా, మన కర్మలే ఆ సుఖదుఃఖాలకు కారణమని తలచే ఆత్మసంస్కరణని ఆధ్యాత్మవిద్య కలిగిస్తుందని – మన ఋషులు చెప్పారు. ఆ కారణంగా వారు మనకందించిన విద్యనే సాయి హిందువులకు చెప్పారు.

కష్టసుఖాలు మనలను సరియైన రీతిన మలచడానికి దైవమే చేస్తాడని తలచినా, అటువంటి ఓరిమే ఆయన ప్రీతికి పాత్రులమవ్వాలన్న సంకల్పాన్ని కలిగిస్తుంది. ధర్మాచరణకు ప్రేరేపిస్తుంది. ఈ విషయాన్ని యిస్లాము, క్రైస్తవమూ చెప్పాయి. పామరుల కంతుబట్టని విషయాలు చెప్పడమనవసరమని వారి భావం.

ఈ జన్మ వృధా చేసుకున్నా మరుజన్మనయినా సార్థకం చేసుకోవచ్చన్న ఆలోచనను, యత్నాన్ని పుట్టిస్తుంది జన్మసిద్ధాంతము. ఈ అవకాశం జారిపోతే యిక మరలా రాదన్న తీవ్రత నిస్తాయి ఇస్లాము, క్రైస్తవమూ. రెండింటిలోనూ లాభాలు, నష్టాలు ఉన్నాయి. ఆయా సాంప్రదాయాల వారికి తద్భిన్నంగా చెబితే వూరికే సందేహాలు, భావనలు, ద్వేషాలు రేకెత్తుతాయి గాని ప్రయోజన ముండదు; సరిగదా వారివారి కర్తవ్యం నుండి మానవులు ఈ వాదాలలోకి దిగుతారు. కనుకనే అట్టి భేదబుద్ధి సామాన్యులకు జ్ఞానియైనవాడు కల్గించక వారికెలా చెబితే కర్తవ్యమాచరిస్తారో ఆ రీతినే చెప్పాలని భగవద్గీత చెబుతుంది.

“దానితో వారికేమి పని? సత్యం బోధించాలిగదా? అనడం అజ్ఞానమే. శ్రేయస్సును చేకూర్చే అసత్యమే సత్యమని, శ్రేయస్సును పాడుచేసే సత్యం గూడ అసత్యమేనని, మహాభారతంలో కృష్ణుడు చెప్పాడు. ఆలోచిస్తే అది నిజమే గూడ. మీరు తలచిన రీతిన హిందువులకు జన్మలేదని గాని, ముస్లింలకు జన్మలున్నాయని గాని చెప్పడం వలన ఆయా మతస్థులు గందరగోళ పడతారేగాని ప్రయోజనమేమీ వుండదు. సాయి చెప్పినట్లు చెబుతేనే ఏ ధర్మానికి చెందినవారు ఆ ధర్మాన్ని శ్రద్ధగా ఆచరించి కృతార్థత పొందగలరు.

ఈ రెంటిలో ఏదో ఒక్కటే సత్యం కాగలదనీ, దానినే ఆయన చెప్పాలనడం సత్యం యొక్క తత్వం తెలియకపోవడం వల్లనే. ఒక్క ఆత్మజ్ఞానం వినా మిగిలినవన్నీ సాపేక్షికసత్యాలే. హిందూధర్మము కూడా ఒకవంక మనకు జన్మ పరంపరలున్నాయని చెబుతూనే, మరొక వంక యిది అవిద్యయని, జనన మరణ రహితము కనుక పునర్జన్మ రహితమయినదే అసలైన ఆత్మయని కూడ చెప్పబడ్డది – ఒక వ్రాత బల్ల చిన్న పిల్లవాడికి ఎత్తైనదిగానూ, వాడే పెద్దవాడయినప్పుడు ఎత్తు తక్కువగానూ తోచినట్లు. అందుకే అధికారి భేదాన్ని బట్టి బోధించగల్గడమే గురువు యొక్క నైపుణ్యమని శాస్త్రం చెబుతుంది.

మిగతా 29వ పేజీలో

మహాయోగి శ్రీ ప్రతాపకోటయ్య శాస్త్రిగారు

శ్రీమతి శ్రీదేవి

ఎందరో మహానుభావులు! వారందరికీ వందనాలు! అటువంటి మహానుభావులలో ఒకరు రాజరాజేశ్వరీ ఉపాసకులు శ్రీ ప్రతాపకోటయ్య శాస్త్రిగారు. శాస్త్రిగారి అద్భుత జీవితం గురించి యిప్పుడు తెలుసుకొందాము.

గుంటూరు జిల్లా బాపట్ల తాలూకాలోని చాగండ్ల అనే గ్రామంలో శ్రీ ప్రతాప జోగయ్యశాస్త్రి, లక్ష్మీదేవి అనే పుణ్య దంపతుల కుమారుడే శ్రీ ప్రతాప కోటయ్య శాస్త్రిగారు.

బాల్యం నుండే శ్రీ కోటయ్య శాస్త్రిగారి ప్రవర్తన అందరి పిల్లలవలె కాక ఎంతో విలక్షణంగా వుండేది. తోటి బాలురతో ఆటపాటలతో పాల్గొనక ఎప్పుడూ ఒంటరిగా కూర్చుని ఏదో ఆలోచనలో నిమగ్నమైవున్నట్లు కన్పించేవారు. చదువు సంధ్యల పట్ల ఆసక్తి అసలే లేదు. ఆ వయస్సులోనే అతని దైవభక్తి, దాననిరతి ఆశ్చర్యం గొలిపేలా వుండేవి. వాకిట్లోకి బిచ్చగాళ్ళెవరైనా వస్తే యింట్లోని డబ్బులు, బియ్యము, బట్టలు అవి ఎంత విలువైనవయినా సరే పుష్కలంగా సమర్పించేవారు. దాన గుణంతో పాటు అతని దయాగుణం కూడా చూపరులకు ఆశ్చర్యం గొలిపేది. చిన్ననాటి నుండీ కూడా ఎదుటి వారి కష్టాలను చూసి అతని హృదయం కరగిపోయేది. తరతమ భేదాలెంచక కోరిన సాయమందిస్తూ ఊరి ప్రజలందరికీ ప్రీతి పాత్రుడైనారు కోటయ్య శాస్త్రిగారు.

కోటయ్యశాస్త్రిగారి తండ్రి అతని ప్రవర్తనకు ఎంతో కలత చెందేవాడు. తల్లి, కాలం గడుస్తున్న కొద్దీ, తన కుమారుడిలోని తరతమ భేదాలెరుగని నిస్వార్థపూరిత ప్రవర్తనకు ఎంతో ముగ్ధురాలయ్యేది. తన కొడుకు దైవాంశ సంభూతుడని ఆమె గుర్తించింది.

కౌమారదశ దాటి యౌవనదశలోకి అడుగిడినా అతని ప్రవర్తనలో మార్పులేదు. అతని మనసు ప్రాపంచిక విషయాల పట్ల ఆకర్షితమవలేదు. ఎవరితోనూ కలవక ఏ విషయంపైనా ఆసక్తి లేక వ్యవహరించే అతని తీరుకు తండ్రి ఎంతో బాధపడేవాడు.

ఒకసారి చాగండ్ల గ్రామంలో వీరి బంధువులింట ఒక పెండ్లి జరిగింది. ఆ పెళ్ళి జరిగిన కొన్నాళ్ళకు పెళ్లికూతురి పుట్టింటివారు మగపెండ్లివారింటికి పంపేందుకు సారె సిద్ధంచేసి దానిని ప్రక్కగ్రామంలోని మగపెండ్లి వారింటికి చేర్చే బాధ్యతను కోటయ్యశాస్త్రిగారికి అప్పగించారు.

ఆనాటి ఉదయం యువకుడైన కోటయ్యశాస్త్రిగారు భుజాన సారె కావడితో కాలినడకన పల్లె బాటన వెళ్తూ, కొంత దూరం వెళ్ళిన తర్వాత బాట పక్కన వున్న ఒక చెట్టు క్రిందకు అలసట తీర్చుకొనేందుకు చేరుకున్నారు. కావడి దింపి చెట్టు క్రింద కూర్చున్నారు శాస్త్రిగారు. పొలాల్లో పనిచేసుకునే రైతుకూలీల పిల్లలు ఆ చెట్టు క్రిందనే ఆడుకొంటున్నారు. వారంతా కావడిలో నుండి వస్తున్న పిండి వంటల సువాసనకు ఆశగా శాస్త్రిగారి వద్దకొచ్చారు. శాస్త్రిగారు పిల్లలను నవ్వుతూ పలకరించి, కావడిలో నుండి పిండి వంటలను పిల్లలకు పంచసాగారు. అలా పంచుతూ "పిల్లలూ, మీకు యింకా కావాలా? తినండి, తృప్తిగా తినండి" అంటూ వాళ్ళకిస్తుంటే కావడిలోని పిండివంటల కుండ చాలా భాగం ఖాళీ అయింది.

కొంత సేదతీరిన తర్వాత కావడి

నెత్తుకొని మరల నడక సాగించారు శాస్త్రిగారు. దారిలో బాటప్రక్కన ఒక నిరుపేద స్త్రీ పొలంలో పనిచేస్తూ కనిపించింది. ఆమె ఒంటిపై నున్న మాసిన, చినిగిన బట్టలు చూసిన శాస్త్రిగారు ఆమె దీనస్థితికి జాలి చెంది, గబగబా కావడి దింపి, కొత్త చీరెలు కొన్ని తీసి, ఆమెతో "అమ్మా, యివిగోనమ్మా కొత్త చీరెలు, ఇవన్నీ నీకే! తీసుకోమ్మా" అంటూ చీరెలు ఆమె కిచ్చి ముందకు సాగారు. పెండ్లి వారింటికి చేరగానే కావడి నందుకొన్న పెండ్లివారు ఎంతో అసంతృప్తితో శాస్త్రిగారితో "ఇదేమి సారె? వస్తువులు, పిండి వంటలు మరీ యింత తక్కువగా పంపారేమిటి?" అంటూ చిరాకు పడుతుంటే, "లేదమ్మా లేదు. వాళ్ళు కుండల నిండుగా సారె పంపారమ్మా. నేనే దారిలో పిల్లలకు పిండి వంటలు పెట్టాను. పాపం ఒక పేదరాలు కనిపిస్తే ఆమెకు కొన్ని చీరెలిచ్చానమ్మా" అన్నారు శాస్త్రిగారు.

సంప్రదాయాలు, లాంఛనాలు, కట్టుబాట్లు వీటికి ప్రజలు ఎంతగానో ప్రాముఖ్యతనిచ్చే ఆ రోజుల్లో యీ విషయం ఆ యిరు కుటుంబాల మధ్య ఎంతో గొడవకు దారి తీసి వుంటుందనటంలో సందేహం లేదు. అయితే శాస్త్రిగారి హృదయంలో యీ ప్రాపంచిక భావనలకు విలువ ఏముంటుంది?

మరొక సందర్భంలో ఏదో పని మీద ప్రక్క వూరికెళ్ళి చాగండ్లకు కాలినడకన తిరిగి వస్తున్నారు శాస్త్రిగారు. అదే సమయంలో కొత్త చీరెలు మూటలు తలపై మోసుకుంటూ అదే దారిలో నడచి వస్తున్న యిద్దరు స్త్రీలు శాస్త్రిగారిని చూశారు. బట్టల వ్యాపారస్థులైన ఆ స్త్రీలిద్దరూ ఆ రోజు చాగండ్ల గ్రామంలో బట్టలు అమ్మేందుకు వెళ్తున్నారు. ఎంతో నిరాడంబరంగా, అమాయకంగా కనిపిస్తున్న శాస్త్రిగారిని చూసి 'వీడెవరో గాని మనిషి దిట్టంగా, బలంగా వున్నాడు. ఈ మూటలు మోయలేక చస్తున్నాం వీడి నెత్తిన పెడితే సరి! వాడే మోసుకొస్తాడు, ఊరి దాకా' అనుకుంటూ "ఇదిగో! అబ్బాయ్! ఏ వూరెళ్తున్నావ్?" అంటూ శాస్త్రిగార్ని పలకరించారు. "చాగండ్ల గ్రామం వెళ్తున్నానమ్మా" అన్నారు శాస్త్రిగారు. "మేము కూడా ఆ వూరే వెళ్ళాలి. బాగా అలసిపోయాం. కాస్త యీ మూటలు వూరి దాకా మోసుకొస్తావా?" అన్నారు. "ఇవ్వండమ్మా" అంటూ ఆ బట్టల మూటలందుకొన్నారు శాస్త్రిగారు. "మేము నిదానంగా నడచివస్తాం. నువ్వు వూర్లో కెళ్ళి రచ్చబండ దగ్గర వుండు. మేం వచ్చి మా సరుకు తీసుకుంటాం" అంటూ ప్రక్కనే వున్న చెట్టుక ఇంద చతికిల పడ్డారా స్త్రీలు.

శాస్త్రిగారు ముందుకు సాగారు. దారిలో కొడవళ్ళు పట్టుకొని వెళ్తున్న గడ్డి కోసే స్త్రీలు కొందరు కన్పించారు. వారి వేషభాషలు వారి పేదరికాన్ని చెప్పకనే చెపుతున్నాయి. దయాశాలి అయిన శాస్త్రిగారు వాళ్ళను పిలిచి, బట్టలు మూటలు విప్పి, చీరెలన్నింటినీ ఆ పేద స్త్రీలకు పంచేసి ఖాళీ చేతులతో వూరు చేరి, రచ్చబండ దగ్గర ఆ బట్టల వ్యాపారస్తుల కోసం వేచి వున్నారు.

కొంతసేపటికి ఆ స్త్రీలిద్దరూ రచ్చబండ చేరారు. వారిని చూస్తూనే శాస్త్రిగారు "అమ్మా! ఏమీ అనుకోవద్దమ్మా! నేను వస్తున్న దారిలో పాపం కొంతమంది నిరుపేద స్త్రీలు కనిపిస్తే చీరెలన్నీ వాళ్ళకిచ్చానమ్మా! పాపం! వాళ్ళు చాలా బీదవాళ్ళమ్మా! అందుకే యిచ్చానమ్మా!" అన్నారు.

ఆ మాటలు విన్న ఆ స్త్రీలు కోపంతో మండిపడుతూ, "ఏమిటీ? కొత్త చీరెలన్నీ పేదవాళ్ళకిచ్చాననంటావా? నీ మాటలు నమ్మటానికి మేము అమాయకులం కాదు. అయినా మా సొమ్ము దానం చేయటానికి నువ్వెవరు? నువ్వు చెప్పేవన్నీ అబద్ధాలే! చీరెలు నువ్వు కాజేసి దానం చేశానని అబద్ధమాడుతున్నావు. మర్యాదగా మా చీరెలెక్కడ దాచావో చెపుతావా? పోలీసులకు పట్టించమంటావా?" అంటూ గద్దించారు. "నేను అబద్ధం చెప్పటం లేదమ్మా. నిజంగానే చీరెలు పేద స్త్రీలకిచ్చాను" అంటున్న శాస్త్రిగారి మాటలు నమ్మక, నోటికొచ్చినట్లు తిడుతూ ఆయనను చెరొక రెక్కా పుచ్చుకొని గ్రామ కరణం వద్దకు లాక్కుని వెళ్ళారా స్త్రీలు.

జరిగిన సంగతి విన్న కరణంగారు శాస్త్రిగారిని చూపిస్తూ ఆ స్త్రీలతో "అతడెవరనుకున్నారు? ఈ ఊరి గ్రామ పెద్ద జోగయ్య శాస్త్రిగారబ్బాయి. అతడెంతో ఉత్తముడు. అతని మీదే దొంగతనం అంటగడ్తారా? పేదసాదలంటే అతనికి సానుభూతి ఎక్కువ. వారికి చీరెలిచ్చి వుంటాడు. అతడు అబద్ధమాడడు" అన్నారు కరణంగారు. "అయ్యా! మేమెంతో పేదవాళ్ళం. ఏదో కష్టం చేసుకుని బ్రతుకుతున్నాం. ఇప్పుడు మా పరిస్థితి ఏమిటి? అని వాపోతున్న ఆ స్త్రీలతో "జోగయ్య శాస్త్రిగారి వద్దకెళ్ళి విషయం చెప్పండి. ఆయన మీకు న్యాయం చెప్తాడు" అని చెప్పి, వాళ్ళను పంపించివేశారు కరణంగారు.

- సశేషం

రాధాకృష్ణ ఆయీ

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

తర్వాత పరమహంసయైన ఒక బ్రాహ్మణ గురువును దర్శించి బ్రహ్మజ్ఞానమెలా వస్తుందని అడిగాడు అవస్తే. ఆయన అవస్తేను పడుకోమని చెప్పి, అతని ప్రక్కనే పడుకొని, "ఏమీ భయపడవద్దు" అని హెచ్చరించి అతని గొంతుమీద చేయివేసి గట్టిగా నొక్కేసారు. అవస్తే భయపడి వారిపట్టు విడిపించుకోజూచాడు. ఆయన, "నువ్వు పిరికివాడివి. నీకు బ్రహ్మజ్ఞానం కలుగదు, వెళ్ళిపో!" అన్నారు.

తర్వాత అవస్తే పూణేలోని ఒక ధర్మశాలలో ఒక మహాత్మురాలిని దర్శించాడు. అపుడు ఆమెవద్ద యెందరో భక్తులున్నారు. అవస్తే ప్రభుతులు మరొక 5 ని॥లలో తమకు దర్శనమవకుంటే వెళ్ళిపోవాలనుకుంటున్నారు. వెంటనే ఆమె తాను చనిపోతున్నానని చెప్పి ముసుగు పెట్టి పడుకున్నది. అందరూ వెళ్ళిపోగానే ఆమెలేచి అవస్తే ప్రభుతులను పిలిచి, వారికి మాత్రమే దర్శనమీయడానికి యీ యుక్తి చేసానని చెప్పింది. అప్పటినుండి అవస్తే ఆమెను తరచుగా దర్శిస్తుండేవాడు. ఆమె మాట్లాడుతుంటే భక్తుల మనసులలోని ప్రశ్నలన్నింటికీ సమాధానాలు దొర్లుతుండేవి. కాని అవస్తే ఎవరినీ గురువుగా స్వీకరించదలచలేదు. అందుకు గూడా అంగీకరించి ఆమె అతనికి పంచాక్షరి ఉపదేశించింది. శాంతి అనే చిత్రమైన పాప దైవసంస్కారం గలది కన్పించి, "నీవు సాక్షాత్కారం కోసం శ్రీరాముని ప్రార్థించు. నేనుగూడా ప్రార్థిస్తాను" అన్నది. నాటి రాత్రి శ్రీరాముని రూపంలో ఆయన వక్షస్థలం క్రింద భాగం దర్శనమవడంతో అతడు భయపడి ఆ సాధన మానివేశాడు.

తర్వాత 1914లో అవస్తే పండరిపురం బయల్దేరుతుంటే దారిలో అతనిని రేగే కలుసుకొని శిరిడీ తీసుకువచ్చాడు. రైలు మూవ్ స్టేషన్ లో ఆగినపుడు ఒక ఆంగ్ల సైన్యాధికారి మిగిలిన రైలు పెట్టెలలోని వారందరినీ దింపి, సైనికుల నెక్కించాడు. కానీ ఈ యిద్దరినీ మాత్రం ప్రయాణం కొనసాగించనిచ్చాడు. అంతసేపూ రేగే అంతకుముందులాగే సాయి నామం జపిస్తూ వున్నాడు. తర్వాత వీరిద్దరూ శిరిడీ చేరగానే అవస్తేను చూపుతూ సాయి, "ఎవరీ పిచ్చివాడు?" అన్నారు. ఆ మాటలకర్థమేమో తర్వాత తెలిసింది. తర్వాత రేగేను చూపుతూ భక్తులతో, "వీడు చూడండి, యితనికి తానొక్కడే వస్తే తృప్తిలేదు, ఇతరులను కూడా తీసుకురావాలంటాడు. సైనికాధికారి నాబిడ్డలను గూడా రైల్లోంచి దింపేయాలనుకున్నాడు. కాని నా బిడ్డలను నావద్దకు రానిమ్మని అతడితో చెప్పాను. ఇతడు (రేగే) రాత్రంతా నన్ను నిద్రపోనివ్వలేదు. రాత్రంతా నా ప్రక్కన 'బాబా, బాబా, అన్న కేకలే! " అన్నారు.

తర్వాత రాధాకృష్ణ ఆయీ ఇంట బసచేయడానికి అవస్తే, రేగేలు వెళ్ళారు. అవస్తేకు ఆమె ఒక సద్గురువులా కన్పించింది. అంతేగాక వెనుక పూణేలో దర్శించిన మహాత్మురాలి గురించి ప్రస్తావించింది. అపుడతడు ఆమెను తన గురుసోదరిగా మాత్రమే తలచగలనన్నాడు. ఆమె, "అయితే నేను చనిపోయినాగూడా నీవు అంగీకరించేలా లేవే" అన్నది. అతడంగీకరించనన్నాడు. వెంటనే ఆయీ తాను చనిపోతున్నాని కేకవేసి నేలపై చనిపోయినట్లు పడిపోయింది. వెంటనే అతనికి తన మొదటి

మిగతా 19వ పేజీలో

మాతృదేవి ప్రథమ ఆరాధనా మహోత్సవము

శ్రీమతి T.పద్మావతి

కాలప్రవాహంలో సంవత్సరకాలం గిర్రున తిరిగి 2022 జూన్ మూడవ తేదీ ప్రవేశించింది. జూన్ మూడవ తేదీ అంటే మాతృదేవిని ఇక ఎప్పటికీ సశరీరంగా చూసే అవకాశం కోల్పోయిన రోజు! క్రిందటి సంవత్సరం ఆ మాట నిజమే అనిపించింది. కానీ "సమాధి అనంతరం నేను అప్రమత్తుడను" అన్న బాబా వాక్కు నూటికి నూరు శాతం పూజ్యశ్రీ అమ్మగారికి కూడా వర్తించింది. ఎందుకంటే ఈ సంవత్సరకాలంలో పూజ్యశ్రీ అమ్మగారు, ఎంతోమందికి సశరీరంగాను, స్వప్నాలలోను దర్శనాన్ని అనుగ్రహించి, 'నేను ఎక్కడికి వెళ్ళలేదు, నిత్యసత్యమై అంతటా వ్యాపించి వున్నాను' అని నిరూపించారు. కనుక ఇది ఖచ్చితంగా ఆరాధనా మహోత్సవమే! ఇంతటి దివ్యస్థితిని పొందిన పూజ్యశ్రీ అమ్మగారి ఆరాధన మహోత్సవాలు, ఆధ్యాత్మికపరంగా ఎంతో అత్యున్నత స్థాయిలో గుమ్మళంపాడులో మాతృదేవి సన్నిధిలో జూన్ 2,3,4,5 తేదీలలో అత్యద్భుతంగా జరిగాయి!!

రెండవ తేదీ ఉదయానికి పట్టణాలనుంచి, నగరాల నుంచి సాయిమాస్టర్ భక్తబృందం మాతృదేవి సన్నిధికి చేరుకున్నారు. అందరి సౌకర్యార్థం భక్తనివాస్ వసతి గృహాలు, అంతట నీడనిచ్చే షామియానాలు, నక్షత్రాలను తలపించే విద్యుత్ దీపాలు, వంటశాలలు, చల్లటి పానీయాల వితరణశాలలు – ఇలా ఇంకెన్నో సౌకర్యాలతో ఆ ప్రాంతమంతా కొత్తరూపు సంతరించుకున్నది. భక్తులందరూ మాతృదేవి సన్నిధికి వెళ్ళే దారిలో తాటాకు పందిళ్ళు వేశారు. ఆ పందిళ్లలో ఇరువైపులా పూజ్యశ్రీ మాస్టరుగారు సాధకులకు నిర్దేశించిన కొన్ని సూక్తులు అమర్చబడ్డాయి. వాటిని చదువుకుంటూ, అందులోని భావాన్ని మనసులో స్మరించుకుంటూ అమ్మ సన్నిధికి చేరుకోవచ్చు.

గుమ్మళంపాడులో మాతృదేవి సమాధి స్థితిలో ఉండి అందరికీ అన్ని ప్రాంతాల వారికి సేవ చేసుకునే ఈ అవకాశాన్ని కల్పించినందులకు కృతజ్ఞతగా, రెండవ తేదీ సాయంత్రం ధూప్ హారతి అనంతరం శ్రీ ద్వారకనాథ్ గారి ఆధ్వర్యంలో పూజ్యశ్రీ అమ్మగారికి షోడశోపచార పూజ, పారాయణ చేసుకోవడం జరిగింది. సాయంత్రం నివేదన అనంతరం శేజ్ హారతి, పవళింపు సేవ చేసుకుని జూన్ 3వ తేదీ జరుపుకోబోయే సంబరాలకు సమాయత్తం అవ్వడానికి భక్తులు భక్త నివాస్ చేరుకున్నారు.

మూడవ తేదీ ఉదయం తెల్లవారుతూనే పూజ్యశ్రీ అమ్మగారికి మేలుకొలుపుతో ఆరాధన మహోత్సవాలు మొదలయ్యాయి. ముందురోజు రాత్రంతా కొంతమంది భక్త బృందం శ్రద్ధాభక్తులతో శ్రీ సాయిబాబాను, పూజ్యశ్రీ మాస్టరుగారిని, పూజ్యశ్రీ అమ్మగారిని మయూరాలంకరణతో అత్యద్భుతంగా రూపకల్పన చేశారు. ప్రత్యేక అలంకరణలో ఆ మహాత్ములు మహోజ్వలంగా మెరిసిపోయారు. తరువాత పూజ్యశ్రీ అమ్మగారికి మేలుకొలుపు, అనంతరం కాకడ హారతి, మంగళ స్నానము, మాతృదేవి సమాధికి పుష్పాలంకరణలలో విచ్చేసిన భక్తులందరూ భక్తిపూర్వకంగా పాలుపంచుకున్నారు.

అటు పిమ్మట శ్రీ ద్వారకనాథ్ గారు ప్రసంగిస్తూ, మొదట్లో పూజ్యశ్రీ అమ్మగారు ఏ ప్రత్యేక కార్యక్రమాలలోనూ మాట్లాడేవారు కాదనీ, తరువాత తరువాత 'మీరు మాట్లాడాలి

అమ్మా', అన్న భక్తుల విన్నపాలతో ప్రసంగించడం మొదలిడారని చెప్పారు. అలాగే సాయిబాబా పత్రికలో తమ బోధను వ్యాసాల రూపంలో రాయవలసిందిగా ప్రార్థిస్తే, రాయడం మొదలు పెట్టారు. పూజ్యశ్రీ అమ్మగారు వ్రాసిన ఈ వ్యాసములన్నింటిని ఒకచోట కూర్చి చదువుకుంటే అమూల్యమైన వారి బోధని మన మనసు ఆకళింపు చేసుకోవడానికి వీలుంటుంది. కనుక వాటన్నింటిని గ్రంథరూపంలో 'ఆధ్యాత్మిక జాగృతి' అన్న పేరుతో ముద్రణ వేయడం జరిగిందని చెబుతూ, అంతటి అమూల్య గ్రంథాన్ని శ్రీమతి వేదమ్మ, శ్రీ శ్రీకాంత్ గార్లను ఆవిష్కరించ వలసినదిగా శ్రీ ద్వారకబాబుగారు ఆహ్వానించారు. వారు భక్తిపూర్వకంగా గ్రంథపూజ తదుపరి గ్రంథావిష్కరణ చేశారు. అనంతరం పూజ్యశ్రీ మాస్టరుగారి రెండవ అన్నగారైన శ్రీ ఎక్కిరాల వేదవ్యాసగారి కుమారుడు శ్రీ విక్రమాదిత్యగారు పూజ్యశ్రీ అమ్మగారితో తనకున్న అనుబంధాన్ని ఎంతో హృద్యంగా అందరితో పంచుకున్నారు.

తరువాత శ్రీ ద్వారకబాబుగారు మాట్లాడుతూ "ఇప్పుడు నివేదన సమయం అయింది కనుక పూజ్యశ్రీ అమ్మగారు శ్రీ సాయిబాబాకి, పూజ్యశ్రీ మాస్టరుగారికి ఏ విధంగా నివేదన చేస్తారో, అదేవిధంగా ఇక్కడ కూడా నివేదన చేయడం జరుగుతుంది" అని చెప్తూ, నివేదన గురించి కొన్ని ఆసక్తికర సంఘటనలు అందరితో పంచుకున్నారు. "పూజ్యశ్రీ అమ్మగారు భోజన నివేదన చేసే విధానం చూసి తీరవలసిందే! అది చాలాసేపు జరిగేది. ఆమె ఎప్పుడెప్పుడు ఏ ఏ క్షేత్రాలకు వెళ్లారో, ఆ క్షేత్రాలలోని మహనీయులకి, ఆమె ఉన్న ఇళ్ళు అన్నింటిలో ఉన్న బాబాకి నివేదన చేసేవారు. కనుక ఇక్కడ నివేదన చేస్తే అన్ని ప్రాంతాలలో నివేదన చేసిన ఫలితం వస్తుంది. నివేదన జరిగినంతసేపు మన మనస్సులు వేరే వ్యవహారాలలో మునిగిపోకుండా భజన జరుగుతుంది. అందరూ భజన శ్రద్ధగా చేస్తూ పూజ్యశ్రీ అమ్మగారు పెట్టే నివేదనలను బాబా మాస్టర్ గార్లకు సమర్పిద్దాం" అని చెప్పారు. నైవేద్యానంతరం జూన్ మూడవ తేదీ మధ్యాహ్నం 1గం-12నిమిషాలకు పూజ్యశ్రీ అమ్మగారు దేహత్యాగం చేశారు కనుక ఆ సమయంలో ప్రత్యేక హారతి చేసుకుందామని చెప్పారు.

అదేవిధంగా శ్రీ యోగ నాగేంద్ర బృందం వారు చేసిన భజనలో భక్తులందరూ గొంతులు కలపగా, సేవకులు భోజన ప్రసాదాన్ని భక్తిశ్రద్ధలతో నివేదన చేశారు. ఆ భజనలు అన్నీ పూజ్యశ్రీ అమ్మగారు రచించినవే! అదేవిధంగా గం.1-12 నిమిషాలకు జరిగిన ప్రత్యేక హారతి సేవలో శ్రీమతి వేదమ్మ, శ్రీమతి లయరాగిత బృందం గీతాలను ఆలపించగా, శ్రీ ద్వారకబాబుగారు నీరాజన సేవ చేశారు. శ్రీ బాబా, పూజ్యశ్రీ మాస్టరుగారి మీద పాడిన హారతులు పూజ్యశ్రీ అమ్మగారిచే రచించబడ్డాయి. పూజ్యశ్రీ అమ్మగారి మీద పాడిన హారతి పాట మాతృదేవి సోదరి శ్రీమతి శ్రీదేవిగారు రచించారు. సాయిమాస్టర్ భక్తబృందం ఆనందాతి హర్షములతో హారతిని తిలకించారు. అనంతరం ఒక్కొక్కరు అమ్మకి నమస్సుమాంజలి ఘటించారు.

తిరిగి సాయంత్రం నాలుగు గంటలకు పూజ్యశ్రీ అమ్మగారి సమాధిని తిరిగి పుష్పమాలలతో సుందరంగా అలంకరించి కాఫీ నివేదించారు. తరువాత శ్రీ బాబుగారు 'ఆధ్యాత్మికత' అన్న అంశం మన జీవితంలో ఎలా ఉంది, దాన్ని నిత్యనూతనంగా మలచుకోవడం ఎలా — అన్న విషయాలు వివరిస్తూ "పూజ్యశ్రీ మాస్టరుగారు, నిత్యజీవితంలో మనం చేసే సాధన ఎంత సులభము, సుఖవంతంగా చేసుకోవచ్చో ప్రవచనాలు, సాయినాథ ప్రబోధామృతం గ్రంథాలలో వివరించారు" అని చెప్పారు. ధ్యానం ఎలా చేయాలో వివరిస్తూ, నేటి సమాజంలో ఉన్న పద్ధతులని ఉదహరించారు. "ముందుగా వెన్నుపూస నిటారుగా పెట్టమంటారు. కొంతసేపు ధ్యానం చేసిన తరువాత, వెన్నుపూస నిటారుగా ఉన్నదో, లేదో చూసుకోవడం సరిపోతుంది" అని చమత్కరిస్తూ, అందరిచేత రెండు నిముషాలు ధ్యానం చేయించారు. అప్పుడు "మీరందరూ నిశ్శబ్దంగా మీలోపల అమ్మగారు చెప్పే మాట వినండి" అన్నారు. ఆ సందర్భంలో శ్రీ బాబుగారి చిన్నతనంలో, పూజ్యశ్రీ మాస్టరుగారు బాబాని ధ్యానించడమెలాగో నేర్పడం, అప్పుడు వీరు నివేదించిన అరటిపండు సాయిబాబా స్వీకరించడం గురించి చెప్పారు. తరువాత "పూజ్యశ్రీ మాస్టరుగారు నిర్దేశించిన మార్గంలో నడుచుకుంటున్న వాళ్ళందరూ తప్పక ఆసనాలు, ప్రాణాయామం చెయ్యాలి" అని చెప్పారు. ఈ విషయాలు, శ్రీ సాయినాథ ప్రబోధామృతం, జ్ఞానయోగ సర్వస్వం గ్రంథాలలో రాసారని తెలియజేశారు. ప్రతివాళ్ళకి డైరీ రాసుకునే అలవాటు కూడా ఉండాలని వారి గ్రంథాలలో ఉన్నదనీ; అలా డైరీలో, ఆ రోజు తానేమీ చేసింది రాసుకుని బాబాకు సమర్పిస్తే, కొద్దిరోజులలో బలహీనతలు తగ్గే అవకాశం ఉంటుందని శ్రీ ద్వారక బాబుగారు వివరించారు.

ఆ ప్రసంగం రెండు గంటల సేపు కొనసాగింది. చాలా

మంచి విషయాలు ప్రస్తావించి ప్రస్తావించినందులకు, అవి చాలా ఉపయోగకరంగా ఉన్నందుకు, అందరూ ఎంతో ఆనందించారు. తదనంతరము పూజ్యశ్రీ అమ్మగారికి ఇష్టమైన 'శ్రీ సాయిబాబా నాటకం' బాపట్ల సత్సంగ సభ్యులచే ప్రదర్శించబడింది. పాత్రలలో లీనమై వారు ప్రదర్శించిన ఆ నాటకం భక్తులందరినీ ఎంతగానో ఆకట్టుకొంది. అనంతరం ప్రసాద వితరణ, శేజ్ ఆరతి, పవళింపు సేవ జరుపుకొని ఆరోజు సేవా కార్యక్రమాలకి ముగింపు నిచ్చారు.

ముందుగా అనుకున్న ప్రణాళిక ప్రకారం 4వ తేదీ ఉదయం పది గంటలకి శ్రీ ద్వారకబాబుగారు పూజ్యశ్రీ అమ్మగారి, పూజ్యశ్రీ మాస్టరుగారి మార్గంలో జీవించడం ఎలా అన్న అంశంపై సత్సంగం ప్రారంభించారు. పూజ్యశ్రీ మాస్టరుగారు ఆశించిన అసలైన ఆధ్యాత్మిక మార్గంలో నడవాలంటే మన జీవితవిధానం ఎలా ఉండాలి? పూజ్యశ్రీ మాస్టరుగారు కేవలం పారాయణ మాత్రమే చేసుకోమని సూచించారా? అయినా అది కూడా నిర్దిష్టంగా ఎందుకు జరగడం లేదు? ఒకవేళ జరిగితే అందరూ ఎందుకు ఈ విధంగా ఉన్నారు? అలా జరుగకపోవడానికి కారణాలు, బాగా జరిగేలా చేసుకునే విధానాలు పూజ్యశ్రీ మాస్టరుగారు సూచించిన గ్రంథాల్లో ఏమైనా ఉన్నాయా? జీవితంలో ప్రతి విషయాన్ని బాబా పరంగా మలుచుకోవడం ఎలా? వీటన్నింటికీ సంబంధించిన సూచనలు, సమాధానాలు పూజ్యశ్రీ మాస్టరుగారు గ్రంథాల్లో రచించారు. ఆ గ్రంథాలని కూడా అవగాహన చేసుకోవలసిన అవసరం ఉందా, లేదా? ఎందుకు వాటిని పఠించి ఆచరించలేకపోతున్నాం? ఇలాంటి ప్రశ్నల బాణాలని సంధిస్తూ ఆ రోజు రెండు పూటలా సత్సంగం ఆద్యంతం చాలా వాడిగా వేడిగా జరిగింది. తరువాత ముఖ్యంగా శ్రీ సాయినాథ ప్రబోధామృతం గ్రంథంలో 16వ పేజీ నుండి 39వ పేజీ వరకు మరియు పరిప్రశ్న గ్రంథంలో నాలుగవ ప్రశ్నకు పూజ్యశ్రీ మాస్టరుగారు ఇచ్చిన సమాధానం మీద కేంద్రీకరించి శ్రీ బాబుగారు ప్రసంగించారు. మధ్యాహ్నం భోజన ప్రసాదం తీసుకోవడానికి కొంత సమయాన్నిచ్చి దాదాపు నాలుగవ తేదీ రాత్రి వరకు శ్రీ ద్వారకనాథ్ గారి సత్సంగం అత్యంత ఆసక్తికరంగా, ఆవేదనా భరితంగా, శ్రేయోదాయకంగా జరిగింది.

మర్నాడు 5వ తేదీ ఉదయం ముందురోజు సత్సంగానికి కొనసాగింపుగా శ్రీ బాబుగారు మాట్లాడుతూ, "నిన్న మనం వేసుకున్న ఎన్నో ప్రశ్నలకు సమాధానం నేను సూచించిన సాయినాథ ప్రబోధామృతం, పరిప్రశ్న గ్రంథాలతో పాటు, ఏదినిజం, మతం ఎందుకు, విజ్ఞాన వీచికలు, శ్రీ సాయిమాస్టర్ ప్రవచనములు, సత్సంగం-భజన గ్రంథాలలో లభిస్తాయి. వీటన్నింటిని అధ్యయనం చేస్తే, తప్పకుండా పూజ్యశ్రీ అమ్మగారు, పూజ్యశ్రీ మాస్టరుగార్ల మార్గంలో నడవగలుగుతాం" అని తెలియజేస్తూ, ఆ పూట సత్సంగాన్ని ముగించారు.

సాయంత్రం 3 గంటల నుంచి పూజ్యశ్రీ అమ్మగారికి ఎంతో ప్రీతికరమైన వేదసభ జరిగింది. అందులో 50 నుంచి 60 మంది వేదపండితులు నాలుగు వేదాలు గానం చేశారు. ఈ సభ ప్రారంభానికి ముందు శ్రీ ద్వారకబాబుగారు వేదం యొక్క గొప్పతనాన్ని వివరిస్తూ వారి తాతగారైన అనంతాచార్యులుగారు వేదం నేర్చుకున్న విధానాన్ని అందరికీ వివరించి, మన అందరికీ పూజ్యశ్రీ అమ్మగారి పవిత్ర సన్నిధిలో వేదగానాన్ని వినగలగడం ఎంత అదృష్టమో భావనచేస్తూ, ప్రశాంతచిత్తులై దానిని ఆస్వాదించమని చెప్పారు. వేదపండితులు ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదంలోని కొన్ని శాఖలను గానం చేశారు. ప్రకృతి అంతా ఆహ్లాదభరితంగా మారిపోయింది. ఇటువంటి అవకాశం రావడమే చాలా అరుదని భావిస్తూ అందరూ భక్తిశ్రద్ధలతో వేదగాన శ్రవణం చేశారు.

వేదగానం చివరలో వేదపండితులందరూ ఆశీర్వచనం చేశారు. అందరి గొంతుల నుండి పెల్లుబికిన ఆశీర్వచన ఘోష నలుదిక్కుల మారుమ్రోగింది. అది విన్న వారందరి హృదయాలు హర్షానందాలతో తేలియాడాయి. అనంతరం గురుపుత్రులు శ్రీ ద్వారకబాబు, శ్రీమతి లయరాగిత దంపతులు పండితులను గ్రంథ, వస్త్ర, దక్షిణ, తాంబూలాలతో సత్కరించారు.

పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధిలో నిర్వహించిన ఇంతటి అత్యున్నత కార్యక్రమంలో అందరికీ పాల్గొనే అవకాశం కలగడం, ఎన్ని జన్మల సుకృతమో అని అక్కడికి విచ్చేసిన వారందరూ ఆనందిస్తూ, ఇది నిర్వహించిన శ్రీ బాబుగారికి ఇందులో పాల్గొనే అవకాశం కల్పించిన శ్రీ బాబా, పూజ్యశ్రీ మాస్టరుగారు, పూజ్యశ్రీ అమ్మగార్లకు కృతజ్ఞతా పూర్వక నమస్సుమాంజలులు సమర్పిస్తూ పూజ్యశ్రీ అమ్మగారి ఆరాధన మహోత్సవానికి ముగింపు పలికారు.

(ఫిబ్రవరి 2015 సాయిబాబా మాసపత్రిక నుండి)

సచ్ఛిష్యుడు

పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ

అది 1963వ సంవత్సరము. ఫిబ్రవరి 9వ తేదీ. ఉదయం సుమారు 7గం॥ల సమయం. సుమారు ఇరవై ఐదు సంవత్సరాల సుందర యువకుడు ఒకరు బాబా సమాధి మందిర ఉత్తర ద్వారం నుండి దక్షిణ ద్వారం గుండా బయటకు వెళ్ళడానికి మందిరం ప్రవేశించాడు. అలా వెళుతూ మధ్యలోనే, అప్రయత్నంగానే కుడివైపుకు సమాధి మందిరంలోని విగ్రహం వైపు దృష్టి సారించాడు. సమాధి మందిరంలోని బాబాదృష్టి ఎంతటి మహత్తరమైనది! అలా చూసిన ఆ యువకుడికి ఆ విగ్రహాన్ని నిశితంగా పరిశీలించాలన్న కుతూహలం కలిగించింది. అంతటితో ఆ యువకుని పాదాలు అటువైపుగా అడుగులు వేశాయి. సమాధి మందిరంలో కుడివైపుగా వున్న ఒక స్తంభం దగ్గర అతడు నిలబడ్డాడు. "సమాధి చెందిన తర్వాత కూడా ఇంతమందిని తనవైపుకు ఆకర్షించే బాబాయొక్క తత్వం ఏమైవుంటుంది?" అని ఆలోచించడం మొదలుపెట్టాడు. నిశితంగా పరిశీలించాలని ఆ విగ్రహం రూపంలో వున్న శ్రీ సాయినాథుని కళ్ళల్లోకి దృష్టి సారించాడు. అంతే! యువకుడి ఆలోచనలు శరవేగంతో చలించసాగాయి. తన ఆలోచనలను తానే గమనిస్తున్న ఆ యువకుడు క్షణంలో స్థాణువుగా కూర్చుండిపోయాడు. సమారు ఐదారు గంటల సమయం అలాగే గడిచింది. ఆ తరువాత తన అన్నగారు తట్టి లేపడంతో బాహ్యస్మృతిలోకి క్రమంగా, నిదానంగా వచ్చాడతడు.

అది ఒక మహత్తరమైన సన్నివేశం! మహోన్నతమైన సంఘటన! ప్రపంచ చరిత్రను లౌకికంగానూ, పారమార్థికంగానూ మరోవిధంగా మలుపు తిప్పిన అద్భుత చరిత్రకు నాంది. ఆనాడు అక్కడ ఆ సన్నివేశాన్ని చూసినవారు చాలా కొద్దిమందే కావచ్చు. వారికి కనిపించింది - శ్రీ సాయినాథుని యొక్క అద్భుత విగ్రహం, ఎదురుకాకుండా కొద్దిదూరంలో కొద్దిగా ప్రక్కకు కూర్చుని ధ్యానస్థులైవున్న ఒక సుందర యువకుని రూపమే కావచ్చు గాక! కానీ సుమారు పాతిక సంవత్సరాలుగా దాదాపు నరసంచారమే కరువైన ఆ శిరిడీ గ్రామం యొక్క రూపురేఖలు ఈనాటిలాగా మారిపోతాయని ఎవరికి తెలుసు? బాబా సమాధి చెందిన తర్వాత శిరిడీని వర్ణిస్తూ ఒక భక్తుడు ఇలా చెప్పాడు "శ్రీ సాయినాథుడు దేహధారులై వున్నప్పుడు వేలాది జనంతో కిటకిటలాడుతూ నిత్యకళ్యాణం పచ్చతోరణంగా విరాజిల్లిన శిరిడీ నేడు కనీసం కొద్దిమందైనా వచ్చే భక్తులు లేక వెలవెలబోతోంది. అంత గొప్ప మహాత్ముని సంగతే ఇలావుంటే, ఇతరుల సంగతి చెప్పవలసినదేమున్నది?".

అయితే ఆ భక్తుని బాధ వ్యర్థమవలేదు. మళ్ళీ బాబా వైభవం ప్రజ్వరిల్లే సమయం వస్తుందన్న దానికి నాందిగా ఆరోజు జరిగిన

సంఘటన తెలియబరుస్తున్నది. శ్రీ శిరిడీ సాయినాథుడు సామాన్య సత్పురుషులు కారు. సమర్థ సద్గురువులు. ఈ ప్రపంచంలోని సద్గురువులందరిలో అగ్రగణ్యులు, కోహినూరు వజ్రం వంటి వారు. ఆయన విశ్వమానవ కళ్యాణ సంకల్పం ఎలా నెరవేర్చుకోవాలో ఆయనకే తెలుసు! అందుకుగాను ఎవరిని ఎంచుకున్నారో అచ్చటి భక్తులకు ఏమి తెలుస్తుంది? అందుకే బాబా ఆ యువకుడిని ఎంచుకున్నారనడంలో సందేహం లేదు. ఇంతకూ ఆ సుందర యువకుడు ఎవరోకాదు -- మన పూజ్యశ్రీ మాస్టరుగారు! ఆయనను అత్యుత్తమ వంశంలోని శ్రీమాన్ అనంతాచార్యులు, శ్రీమతి బుచ్చిమాంబగార్లకు పుత్రునిగా జన్మింపజేసి, పాతిక సంవత్సరాలపాటు నిరంతర సత్యాన్వేషకునిగా తీర్చిదిద్ది, చివరకు తన శిష్యునిగా స్వీకరించడానికి తమ చెంతకు చేర్చుకున్నారు సాయి. సాయి దేహంతో వున్నప్పుడే, “ఎవరు నా శిష్యులనేది? నా శిష్యుడనదగినవాడు ఇంతవరకూ ఒక్కడు కూడా కనపడలేదు” అన్నారు. కానీ సమాధి అనంతరం, “నీకు గురువులేరని ఎందుకు బాధపడతావు? నేనున్నాను” అని తనకు గురువు లేరని బాధపడుతున్న మాస్టరుగారికి ముమ్మారు చెప్పారు బాబా. దీనిని బట్టి పూజ్యశ్రీ మాస్టరుగారు ఆయన ప్రియతమ శిష్యుడు అని మనకు అవగతమౌతుంది కదా?

ఆనాడు తమకు కలిగిన అనుభవం గురించి మాస్టరుగారు తాము రచించిన ‘శ్రీ సాయిలీలామృతము’ అనే గ్రంథంలో క్లుప్తంగా వ్రాసి వున్నారు. అయినప్పటికీ సందర్భానుసారంగా మరొక్కసారి స్మరించుకోవడం ఇక్కడ సమంజసము. అందులో ఆయన ఇలా వ్రాశారు :

“మద్రాసు హోటలుకు వెళదామని సమాధి మందిరం మీదుగా వెళ్తున్నాను. హారతి, అభిషేకము అయిపోయాయి కాబోలు, అక్కడ పూజారులు తప్ప ఎవరూ లేరు. జీవకళతో కళకళలాడుతున్న అచ్చటి విగ్రహాన్ని మాత్రం మరొక్కసారి చూడాలనిపించి మందిరంలోకి వెళ్ళాను. ఆ విగ్రహంలోని బాబా ముఖం చూస్తుంటే, అందులోని సాయి చూపు అంతర్ముఖమై ఏదో అతీతమైన స్థితిలో వున్నట్లు తోచింది. ఆ స్థితిలో ఆయనకు తననుండి వేరుగా ఈ సృష్టి వున్నట్లు తోచివుండదని, విశ్వమంతా ఏ మహత్తర చైతన్యంలో సంకల్పమాత్రంగా వున్నదో దానితో ఆయన తాదాత్మ్యం చెందివున్నారనిపించింది. ఇది కేవలం భావంగా గాక ఒక అనిర్వచనీయమైన అనుభవంగా నా హృదయాన్ని కబళించింది. నా చుట్టూ, నా లోపల ఏమి జరుగుతోందో తెలియలేదు.

అలా ఎంతసేపు గడిచిందో తెలియలేదు. కొంతసేపటికి త్రుళ్ళిపడి లేచాను. మా అన్నగారు నా వీపు తట్టి భోజనానికి రమ్మంటున్నారు. ఆ స్థితిలోనుంచి మేల్కొనడమెంతో బాధనిపించింది. టైము చూస్తే నేనక్కడకువచ్చిసుమారు 5 గంటలైంది. అంతసేపు నేను నిలబడి విగ్రహాన్ని చూస్తున్నాననుకొన్నాను, నిజానికి కూర్చుని వున్నాను. కళ్ళు మూతబడి వున్నాయి. భోజనానికి వెళుతూవుంటే కలలో నడుస్తున్నట్లుంది. గాఢనిద్రలో లేపితే తిరిగి మనస్సు నిద్రలోకి మళ్ళినట్లు, నా మనస్సు అప్రయత్నంగా నిరామయమౌతున్నది. వస్తువులను గుర్తించాలన్నా, యోచించాలన్నా, ఎంతో ప్రయత్నం చేయవలసివస్తున్నది. ఇల్లు చేరి కొద్ది నెలలు గడచినా నా స్థితి అలానే వుండిపోయింది. గాఢమైన శాంతి ఆనందాలతో రోజులు, నెలలు క్షణాల్లా గడిచిపోయేవి. జగత్తంతా చైతన్యమయంగా తోచేది.”

దీనిని బట్టి పూజ్యశ్రీ మాస్టరుగారు విశ్వచైతన్యానుభూతిని పొందారనడంలో సందేహం లేదు. విశ్వ చైతన్య స్వరూపుడైన సాయినాథునితో ఆయన సమైక్యత కలిగి వున్నారనడంలో అంతకంటే సందేహం లేదు. అయినప్పటికీ, ”ఇదంతా నా గురువు చలవే. ఆయన కృపవల్లనే నాకీ స్థితి కలిగింది” అని శ్రీ సాయినాథుడు చెప్పినట్లు, పూజ్యశ్రీ మాస్టరుగారు తమ గురువు యొక్క కృపను గూర్చి స్మరిస్తూనే వుండేవారు. అంతటితో ఆగక ఆయన గూర్చి, ఆయన చేసిన లీలల గూర్చి, ఆయన బోధలగూర్చి ఇంకా ఇంకా తెలుసుకోడానికి నిరంతర ప్రయత్నం చేస్తూనే వుండేవారు. ‘సచ్ఛిష్యుడు తన గురువు యొక్క ప్రతిభను నిరంతరం కొనియాడుతూనే వుంటాడు’ అని పెద్దలు చెప్పినట్లు పూజ్యశ్రీ మాస్టరుగారు బాబా లీలలగూర్చి, సూక్తుల గూర్చి, బోధల గూర్చి సుదీర్ఘంగా వివరిస్తూ గ్రంథాలు వ్రాశారు. ఆయనే గనుక వివరించకపోతే బాబా వచనాల యొక్క వివరణ మనకు అంతగా తెలిసేది కాదేమో!

ఉదాహరణకు ‘గురువును తెలుసుకోవాలి. లేకపోతే ఎందుకు

వచ్చినట్లు? పిడకలు ఎరుకోడానికా?' అన్న బాబా వాక్యానికి పూజ్యశ్రీ మాస్టరుగారి వివరణ ఇలా వుంది – "సద్గురువు తారసిల్లడమే మహాభాగ్యం. కానీ సూక్తులలో వివరించినట్లు అది సఫలమవ్వాలంటే ఆయనయొక్క ప్రాశస్త్యాన్ని గుర్తించి, తగురీతిన సేవించి, ఆశ్రయించి అనుసరించాలి. అంటే ఆయన మహిమను గుర్తించి, ఆయన పట్ల గురుభావాన్ని పొందగలగాలి. ఇందుకు సరియైన శాస్త్రజ్ఞానం, వివేకం అవసరం. అవి లేకుంటే సద్గురుని సన్నిధి లభించినా ఎందరెలా దానిని నిష్ప్రయోజనం చేసుకుంటారో గమనించాము. ఆ విషయం సాయి ముఖం నుండి ప్రత్యక్షంగా వింటూ, దానిని ఆచరించి సాయి పొందిన మహోన్నత స్థితిని చూస్తూ కూడా ఆయనను అలా ఎవరూ సేవించలేక పోవడమే చిత్రం. "ఎవడు నా శిష్యుడనని చెప్పుకోగలిగేది? నా గురువును నేను సేవించినట్లు సేవించగలిగితేనే అలా చెప్పుకోవాలి. అటువంటి వాడు నాకు ఒక్కడు కూడా కనిపించలేదు" అని సాయి అన్నారు. ఆయన మహిమను అరవై సంవత్సరాలపాటు ప్రత్యక్షంగా చూస్తూ కూడా ఆయననలా భక్తులు సేవించలేక పోయారంటే ఆయన చరిత్రను పారాయణ చేసి అనుభవాలను వారి మహాసమాధి అనంతరం పొందే మనమెంత జాగరూకతతో ప్రవర్తిస్తే లక్ష్యాన్ని సాధించగలమో గుర్తించి నడుచుకోవాలి. అప్పుడే మనము గురువును తెలుసుకోగలిగామని అర్థం. తెలుసుకోలేనప్పుడు ఆయన వద్దకు చేరికూడా నిష్ప్రయోజనమౌతుంది. మామిడిపూతలా మనమూ రాలిపోతాము. గురువును తెలుసుకోని జీవితం పిడకలవేట మాత్రమే అవుతుంది. పిడకలేరుకోవడమంటే మరణానికి మాత్రమే మన దేహాన్ని సంసిద్ధం చేస్తూ దానిని తదనంతరం దహనం చేయడానికి అన్ని ఏర్పాట్లూ చేసుకోవడమన్నమాట".

అలాగే, 'దైవమిచ్చింది. పోదు. మానవుడిచ్చింది. నిలువదు' అన్న సూక్తికి పూజ్యశ్రీ మాస్టరుగారు ఇలా వివరణ ఇచ్చారు:

వివరణ: భక్తులెవరికి ఏమిచ్చినా, సహాయం చేసినా అది సాటి మానవునికి చేసినట్లు తలచరాదు. సర్వరూపాలలోనూ ఎల్లప్పుడూ బాబాయే సంచరిస్తున్నారన్న గుర్తింపు కలిగివుండాలి. వారికి సమర్పించినట్లే తలచాలి. లేకుంటే అట్టి దానంలో, సేవలో కొన్ని లోపాలేర్పడతాయి. మొదటిది, తానిచ్చినది తనదేనన్న భ్రాంతి కలుగుతుంది. బాగా యోచిస్తే మన దేహమానసాదుల నుండీ, ప్రపంచంలోని సర్వవస్తువులూ భగవంతునికే చెందుతాయి. 'అల్లా మాలిక్'. ఆయనిచ్చినదానిని కృతజ్ఞతతో కూడిన సేవాభావంతో ఆయనకుగాని, ఆయన ధరించిన రూపాలైన ప్రాణులకుగాని సమర్పిస్తున్నామని గుర్తుంచుకోవాలి. ఇది గుర్తించినపుడు మనలను సహాయం అర్థించిన వారిపట్ల న్యూనతాభావం కలుగదు. చులకనైన భావంతో సమర్పించేది పుణ్యాన్ని హరిస్తుంది. ఆ కారణంగా సమర్పించకపోవడం మరింత దోషం. సరైన భావంతో సమర్పించినదే సాత్వికమైన దానం. ఈ విషయాన్ని తెల్పడానికే భగవద్గీతలో శ్రీకృష్ణుడు దానాన్నెల్లప్పుడూ "తత్సత్ బ్రహ్మార్పణమస్తు" అన్న భావంతో చేయమన్నారు. అలా చేస్తే అట్టి దానం వలన పుణ్యము, దాని ఫలితమైన ఉత్తమలోకాలు, సిరిసంపదలతో కూడిన పునర్జన్మ రూపాలలో కర్మ ఫలితమూ మనలను బంధించక చిత్తశుద్ధిని, వివేక వైరాగ్యాలనూ సిద్ధింపజేసి, మనకు శాశ్వత దుఃఖనివృత్తి కలిగేలాగా చేస్తుంది. అంతేకాదు, కర్తృత్వ భావంతో ఆప్తులైన సాటిజీవులకు మనదైన వస్తువును దానం చేస్తున్నామన్న భావంతో సమర్పించినా, సహకరించినా అది ఋణానుబంధమై మనలను జన్మచక్రంలోకి లాగుతుంది. అట్టి సహకారాన్ని పొందినవాడి పాత్రతను బట్టి ఫలితం మనకూ సంక్రమిస్తుంది. సాత్వికమైన దానం మాత్రం భగవదనుగ్రహాన్ని ప్రసాదిస్తుంది. అట్టి ఫలితం శాశ్వతం.

అంతేకాక సాయిచేసిన లీలల మాటున వున్న ఆయన ప్రబోధాన్ని కూడా పూజ్యశ్రీ మాస్టరుగారు చక్కగా వివరించారు. ఆయన ఇలా అంటారు :– "భక్తులకు లౌకికమైన సహకారాన్ని అందించడం మాత్రమే సాయి లీలల లక్ష్యం కాదని గుర్తించాలి. వారి లీలలను స్థూలంగా మాత్రమే గుర్తించి, చదివి పులకించే భక్తులు వారి చరిత్రము పారాయణ చేయనివారి క్రిందే లెక్క. అంతకు మించిన తాముద్దేశించిన ప్రయోజనాన్ని సాయియే కొంత సూచించారు. కోరికలీడేర్చారన్న కృతజ్ఞత, ప్రేమలవలన మానవుడు భక్తిమార్గంలోకి తనకు తెలియకనే లాగబడతాడు. ఈ విషయం కూడా సంపూర్ణ సత్యం కాదు. తమ

లీలలద్వారా సాయి బోధించదలచిన ఆధ్యాత్మిక రహస్యాలకు అంతులేదు.

ఒక పేద బ్రాహ్మణునికి సాయి కాగితంలో చుట్టి ఇచ్చిన మాంసం అతడికి పూర్వపుణ్యం చేత సంక్రమించిన గురుకృప, సాయికృప. అది మహాప్రసాదమే ఆయినా చూడడానికి సాయి ముస్లిమ్ లాగ కనిపించినట్లు అది అతనికి మాంసంలా కనిపించింది. సాయి విధించిన సబూరీని, నిష్ఠను వహించి దానిని విశ్వాసంతో ఇంటికి తీసుకుని పోకుండా; మధ్యలోనే తెరిచి చూసి, ఏవగించుకుని పారేసిన తర్వాత అది బంగారమని తెలిసింది ఆ బ్రాహ్మణుడికి! బంగారం చేతికొచ్చినా నిరుపేదగానే ఇల్లు చేరిన ఆ దురదృష్టవంతుడి లాగా మనం కూడా సాయి, సాయి బోధలవంటి వెలలేని పెన్నిధి లభించినా శ్రద్ధాభక్తులు కరువై నిర్భాగ్యులుగానే ఇక్కడ నుండి నిష్క్రమించడం ఎంత సమంజసం?

సర్వజ్ఞుడైన సాయి తమకు నివేదించకుండా గార్డే ఏమి తినడని, పండిట్ అలా అర్పించకుండా తింటాడని అన్నారు. సద్గురువెప్పుడూ అదృశ్యంగా భక్తుని వెంట వుంటారు. అది అతడు గుర్తుంచుకోకపోవడం అతని దురదృష్టం.

శిరిడీలో వారం రోజులు వుందామని వచ్చిన కాకామహాజనిని వెంటనే తిరిగి వెళ్ళమని చెప్పడం లోనూ, వెంటనే వెళ్ళదలచిన ధూమల్ ను నిలిపివేయడంలోనూ సాయి యొక్క బోధనాదక్షత తెలుస్తుంది. ఇష్టాయిష్టాలు అపారశ్రేయస్సును ప్రసాదించే భగవత్కృపను కూడ మనకు చెందనివ్వని ప్రబలశత్రువులు, ఇంటిదొంగలు. వాటిని వీడనిదే గురుకృప లభ్యం కాదు. వివేక వైరాగ్యాలు, నిష్ఠ-ఓరిములు కుదరవు. కృష్ణుడు చెప్పిన హితాన్ని విననివ్వక కర్ణ, దుర్యోధనాదులు ఆత్మనాశనం గావించుకునేలా చేసినవవే. పూర్వపుణ్యమున సద్గురువు లభించినా మామిడిపూతలా అకాలంలో రాలిపోయేలా చేసేవవే. అందుకే వాటిని నిగ్రహించాలని భగవద్గీత చెబుతుంది. ఆ రెండిటిని వీడనిదే సాధన లేదు. దుఃఖమే గతి. అలాగే శ్రీ సాయి అప్పుడప్పుడూ చెప్పిన చిత్రమైన కథలకు ఆధ్యాత్మిక వివరణను పూజ్యశ్రీ మాస్టరుగారు ఇలా ఇచ్చారు.

సాయి చెప్పిన కథ :

"ఒకడికొక అందమైన గుఱ్ఱముండేది. వాడెంత శ్రమించినా అది జంట గుఱ్ఱంతో కలిసి పనిచేయలేదు. దానిని ఎన్ని దేశాలు తిప్పినా ప్రయోజనం లేకపోయింది. ఎంత శిక్షణనిచ్చినా అది లొంగలేదు. చివరికొక పండితుడు దానినెక్కడ నుంచి తెచ్చారో అక్కడికే తీసుకుపొమ్మని సూచించాడు. అలా చేయగానే ఆ గుఱ్ఱం సక్రమంగా పని చేయనారంభించింది."

ఈ కథకు పూజ్యశ్రీ మాస్టరుగారు ఇచ్చిన వివరణ ఇలా వుంది :

అందమైన గుఱ్ఱమంటే వాసనలతో మదించిన మనస్సు. జంట గుఱ్ఱమంటే మంత్రమని చెప్పవచ్చు. యోగపరిభాషలో ప్రాణచలనమని చెప్పవచ్చు. దానితో కలిసి మొదటి గుఱ్ఱం పనిచేయక పోవడమంటే నిరంతర మంత్రజపంలో లయించక పరిపరివిధాల పరుగులు పెట్టడమన్నమాట. లేక యోగ పరిభాషలో శ్వాసక్రియతో ఐక్యత చెందకపోవడమని చెప్పాలి. ఎన్ని సాధనామార్గాలూ దానికి ఉపకరించలేదు. ఒక పండితుడు – అంటే భగవద్గీతలో చెప్పినట్లు జ్ఞాని – చేసిన సూచనకర్థం మనస్సును దాని పుట్టుక స్థానం మీద కేంద్రీకరించమని. మనస్సనేది ఏది? అదెక్కడ ఉదయిస్తుంది? అని పరిశీలించడమన్నమాట. అలాచేస్తే మనస్సు లయిస్తుందని భగవాన్ రమణమహర్షి కూడా చెప్పారు. అట్టి సాధనలో స్థిరపడడమే గుఱ్ఱం లొంగి పనిచేయడమంటే. మనస్సు లొంగితే ప్రాణము కూడా లొంగుతుంది. కారణం ఆ రెంటికీ మూలమొక్కటే. అంటే ఉత్తమాధికారికి మనస్సు స్వస్థముకావడం వలన ప్రాణచలనం దానికై అదే ప్రాణాయామాదులవసరం లేకనే కేవల కుంభకాన్ని పొందుతుంది. వాటి యజమాని పని నెరవేరుతుంది.

20-1-1913న సాయి ఒక కథ చెప్పారు – "నాకొక మంచి బావి వుండేది. అందులో నీరు ఆకాశం వలె స్వచ్ఛమైన నీలిమిరంగుగాను, తరుగులేనిదిగాను వుండేది. నాలుగు మోటాలతో తోడినా అందులోని నీరు అయిపోలేదు. ఆ నీటితో పండిన పండ్లు ఎంతో అందంగాను, రుచిగానూ వుండేవి."

దానికి పూజ్యశ్రీ మాస్టరుగారు ఇచ్చిన వివరణ ఇలా వుంది – బావి హృదయం, నీలివర్ణపు నీరు ధ్యానంలో అనుభవమయ్యే చిదాకాశం. నాల్గు మోటాలు చతుర్విధ పురుషార్థాలు – ధర్మ, అర్థ, కామ, మోక్షాలు. అంటే పురుషార్థాలన్నీ ఎన్ని నెరవేర్చుకున్నా వాటికంటే గూడ అధికమైన ఫలితాన్ని

అట్టి ఆత్మనిష్ఠ యిచ్చినదన్నమాట. అట్టి చెదరని ఆత్మనిష్ఠతో ఆయన ధర్మ, అర్థ, కామాలనుగూడ నిర్వర్తించారు. వాటి ఫలితం సామాన్యమైన పండ్లకంటే – అంటే సామాన్యులు నెరవేర్చుకొనే ధర్మార్థకామమోక్షాలకంటే – విలక్షణంగా ఉన్నాయిట! మోక్షమన్న మోటాతో నీరు చేదడమంటే ఏమిటి? జ్ఞానము లేక మోక్షమన్నది ఒక అంత్యములేని స్థితియని గుర్తించాలి. ఆ నీటితో పండిన మోక్షఫలం గూడా విశేషంగా వుండినదని భావం. తన ముక్తి కొరకు చేసిన సాధన ఫలితం కంటే సర్వజీవుల దుఃఖ నివారణ కోసం చేసిన సాధన ఫలితం గొప్పదని బుద్ధుడు చెప్పినది గమనార్హం. అయితే అట్టిది ఆత్మనిష్ఠను వీడకుండా ధర్మార్థకామాలను నెరవేర్చగల వాడికే సాధ్యమవుతుంది.

అలాగే శ్రీ సాయినాథుని చిరునవ్వు గూర్చి కూడా ఆయన వివరించారు. శ్రీ సాయియొక్క ప్రతిచర్య, మాట గూర్చి నిరంతరం చింతన చేసిన ఒక్కొక్క అద్భుత సత్యం స్ఫురిస్తుంటే పులకించడంలో మన అంతఃకరణ వెయ్యి సూర్యుల కాంతితో వెలుగుతుంది. అలా చింతన కొనసాగిస్తుంటే క్రమంగా ప్రతిక్షణము ఆయనలో నిత్యనూత్నమైన అంశాలను గమనిస్తూ పారవశ్యంలో లీనమైపోతాము. వారి మాటలను ప్రతిసారీ కొత్తగా వింటాము. అలా అంతకంతకూ ఆయన యొక్క విశిష్టతలోని కొత్త అంశాలను గమనిస్తాము. ఆయన గూర్చిన మన అవగాహన కూడా ప్రాకృతికమైన మన దేహంలాగానే అనుక్షణమూ వృద్ధిచెందుతుంది. అంతమేరకు ఆయనపట్ల మన ధ్యానం వృద్ధి చెందుతుంది. అలా చూడటం నేర్చుకోమని వారి చూపు, అలా వినడం నేర్చుకోమని వారి మౌనము, అలా నిరంతరం సద్గురుధ్యానంలో పరవశించమని వారి చిరునవ్వు, చూపు మనలను ప్రబోధిస్తున్నాయి. ఆయన ప్రతిరూపాలుగా మనం మారేదాకా యీ ధ్యానము, పారవశ్యము, చింతన సాగవలసినదే. అదే వారి గురువువద్ద నేర్చినది. మనకు వారు నేర్పేదీ కూడా! ఇదే వారు సూచించిన, ఆచరించిన ధ్యానమార్గం.

ఈ విధంగా పూజ్యశ్రీ మాస్టరుగారు బాబా చెప్పిన వాక్యాల గూర్చిన, లీలల గూర్చిన, బోధల గూర్చిన వివరణలను ఎన్నింటినో 'శ్రీ సాయినాథ ప్రబోధామృతము' అనే గ్రంథంలో పొందుపరిచారు. మచ్చుకు కొన్నింటిని మాత్రమే పైన చెప్పుకున్నాము.

పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పడమే కాదు, తాము నిరంతరమూ సాయి చింతన కొనసాగించి ప్రతిక్షణమూ ఆయనలో నిత్యనూతనమైన అంశాలను గమనిస్తూ పారవశ్యంలో లీనమైపోయేవారు. అలా నిరంతర సద్గురు ధ్యానంలో పరవశించి పోయేవారు. "గురుతమము, శక్తియుతమూ అయిన సూర్యగోళము యొక్క ఆకర్షణ పరిధిలో ప్రవేశించిన అంతరిక్షనౌక ఆ సూర్యునిలో, దాని వెలుగులో, అగ్నిలో కరిగిపోయినట్లు సచ్ఛిష్యుడు కూడ గురువుతో అనన్యత పొందుతాడు" అని పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పినట్లు ఆయన కూడా స్వయంగా తమ గురువైన శ్రీ సాయినాథునితో అనన్యస్థితిని పొందారు. శ్రీ సాయినాథుడు తాము, పూజ్యశ్రీ మాస్టరుగారు వేరుగాదని అనుభవాలిచ్చారు కూడా.

ఉదాహరణకు, అనంతపురానికి చెందిన కె.నారాయణమూర్తి వారి మిత్రులొకరికి పూజ్యశ్రీ మాస్టరుగారు ప్రత్యక్ష దర్శనమనుగ్రహించిన విషయం వినినప్పటి నుండి 'తాను 10 సం॥లుగా పారాయణ చేస్తున్నా తనకు ఆయన దర్శనభాగ్యం కలుగలేదే' అని బాధపడుతుండేవారు. ఒకరోజు ఆయనకు స్వప్నంలో పూజ్యశ్రీ మాస్టరుగారు దర్శనమిచ్చారు. ఆయన తెల్లని పంచె, బనీను వేసుకుని నారాయణమూర్తిగారి ఇంటి ముందునుంచి వెళ్తుంటే ఆయన మాస్టరుగారిని తమ ఇంటికి రమ్మని ఆహ్వానించారు. ఆయన వచ్చి మౌనంగా పద్మాసనంలో కూర్చున్నారు. మూర్తిగారు పాదనమస్కారం చేసుకోగానే ఆయన ఏమి మాట్లాడకుండానే వెళ్ళిపోయారు. ఆయన వెళ్ళిన వెంటనే శ్రీ సాయిబాబా తెల్లని దుస్తులు ధరించి వచ్చి కూర్చున్నారు. బాబా పాదాలకు మూర్తిగారు నమస్కరించుకుని బాబాతో, "ఇప్పుడు వచ్చారేమిటి బాబా? కొద్దిక్షణాలముందు వచ్చివుంటే మీ శిష్యుణ్ణి చూపించి వుండేవాడిని కదా!" అన్నారు. వెంటనే బాబా అతనివైపు సీరియస్ గా చూసి, "వాడిని నీవు నాకు చూపించడమా? వాడే నేను – నేనే వాడు!" అంటూ అదృశ్యమయ్యారు. అంటే సాక్షాత్తూ సద్గురు శ్రీ సాయిబాబాయే పూజ్యశ్రీ మాస్టరుగారని బాబాయే స్వయంగా స్పష్టపరచారన్నమాట!

శ్రీ సాయిబాబావలెనే పూజ్యశ్రీ

మాస్టరుగారు కూడా భక్తులకు ఎన్నో అనుభవాలను ప్రసాదించారు మచ్చుకు కొన్నింటిని ఇక్కడ ప్రస్తావించుకుందాము.

ఒక సాయి భక్తురాలు భరద్వాజ మాస్టరుగారి పేరు వినడమేగాని చాలాకాలం వరకూ కనీసం వారి ఛాయాచిత్రమైనా (ఫోటో) చూడలేదు. ఒకసారి ఆమెకు బెంగుళూరు త్యాగరాజనగర్‌లోని సాయి ఆధ్యాత్మిక కేంద్రంలోని సాయినాథుని విగ్రహంలో పూజ్యం మాస్టరుగారు సశరీరులుగా దర్శనమిచ్చారు. అలా దర్శనమిచ్చిన వారెవ్వరో ఆమెకు తెలియలేదు. తర్వాత కొన్నాళ్ళకు శ్రీభరద్వాజ మాస్టరుగారి ఫొటో చూడడం సంభవించింది. తామెవరో ఆమెకు తెలియక మునుపే ఆ విధంగా దర్శనమిచ్చి అనుగ్రహించినందుకు ఆమెకు ఎంతో ఆనందము, ఆశ్చర్యము, భక్తి కలిగాయి.

పెదపవని వాస్తవ్యులైన జి.వి. రంగారావుగారు పూజ్యశ్రీ మాస్టరుగారి దర్శనానికి ఒంగోలు వస్తుండేవారు ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారిని దర్శించినపుడు రంగారావుగారు తనకు ఏకముఖి రుద్రాక్ష కావాలని కోరికగా వున్నదని ఆయనతో చెప్పారు. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు ఆయనతో, "మనకు అవన్నీ ఎందుకు లేవయ్యా! సాయినాథుని సేవిస్తుంటే చాలు కదా!" అన్నారు.

ఆ తర్వాత రంగారావుగారు ఒకసారి తిరుపతి వెళ్ళారు. జనం రద్దీ ఎక్కువగా వుండడంతో ఆయనకు ఆ రోజు స్వామి దర్శనమౌతుందో లేదోననే అనుమానం కలిగింది. ఏమైనాసరే దర్శనం చేసుకోకుండా భోజనం చేయకూడదని నిర్ణయించుకుని టి.బి. గార్డెనుకు వెళ్ళి ప్రార్థిస్తూ కూర్చున్నారాయన.

అక్కడ ఆయనకు తెలియకుండానే నిద్రపట్టింది. సుమారు రెండు గంటల ప్రాంతంలో మధ్యాహ్నం వేళ పూజ్యశ్రీ మాస్టరుగారు ఆయనను నిద్ర లేపి, "ఏమిటి రంగయ్యా ఇక్కడ వున్నావు?" అని అడిగారు. రంగారావుగారు మాస్టరుగారికి తన విషయం వివరించారు. పూజ్యశ్రీ మాస్టరుగారు ఆయన చేతిలో ఒక కాగితం పొట్లం పెట్టి ఆయనను వెంట తీసుకుని నేరుగా వెయ్యికాళ్ళ మంటపం దాటి మహా గోపురం దాకా తీసుకెళ్ళారు. వి.ఐ.పీ.లు ఎవరో స్పెషల్ దర్శనానికి వెళుతూవుంటే రంగారావుగారిని వారితో కలిపి ఆయన వెళ్ళిపోయారు. చిత్రంగా రంగారావుగారిని ఎవరూ ఆపలేదు. ఎంతో ఆనందంగా స్వామి దర్శనం చేసుకుని బయటకు వచ్చేసరికి పూజ్యశ్రీ మాస్టరుగారు కనిపించలేదు. రంగారావుగారు ఆ ప్రాంతమంతా వెతికారు. కానీ పూజ్యశ్రీ మాస్టరుగారి జాడ లేదు. తరువాత రంగారావుగారు తన లాల్చీ జేబులో పెట్టుకున్న పొట్లం విప్పి చూస్తే అందులో రుద్రాక్షవున్నది! చిత్రంగా అది ఏకముఖి రుద్రాక్ష మాత్రమే గాక అందులో గంగపాయ, త్రిశూలము. శివలింగము, నాగేంద్రుడు. ఓంకారము కూడా వున్నాయి. ఆ తర్వాత పూజ్యశ్రీ మాస్టరుగారు రంగారావుగారికి దర్శనమిచ్చిన రోజున ఒంగోలులోనే వున్నారని తెలిసింది.

రామిరెడ్డి గోపాలరెడ్డిగారి పాపకు 8 సం॥లు వచ్చినా నడక, మాట రాలేదు. ఒకసారి వారి మేనల్లుడైన పి. విజయకుమార్ పూజ్యశ్రీ మాస్టరుగారిని సత్సంగానికి వారింటికి తీసుకుని వచ్చాడు. సత్సంగం అయిన తరువాత పూజ్యశ్రీ మాస్టరుగారికి పాయసాన్ని నివేదనగా ఒక కప్పులో సమర్పించుకున్నారు. అప్పుడు మాస్టరుగారి వద్దకు పాకుతూ వచ్చిన ఆ పాపకు ఆయన తమ చేతిలో వున్న కప్పులోని పాయసాన్ని కొద్దిగా త్రాగించారు. ఆశ్చర్యంగా మరునాటి ఉదయమే ఆ పాప శరీరంలో కదలిక వచ్చి త్వరలోనే నడువనారంభించింది. ఇంతటి అద్భుతలీలను అవలీలగా చేసిన మాస్టరుగారి సామర్థ్యానికి, అనుగ్రహానికి వారెంతో ఆశ్చర్యపోయారు. ఆ కుటుంబ సభ్యులందరూ నేటికీ మాస్టరుగారిని సేవిస్తూనే వున్నారు.

అంజనేయస్వామి భక్తుడొకడు తన మిత్రుని బలవంతం మీద పూజ్యశ్రీ మాస్టరుగారిని దర్శించాడు. అతనికి గురువులమీదఏమాత్రంనమ్మకంలేదు. పూజ్యశ్రీ మాస్టరుగారిని చూడగానే అతనికి ఆయనపట్ల ఏమీ ఉన్నత భావం కలుగలేదు. ఇంతలో అతని మిత్రుడు బయటకు వెళ్ళాడు. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు అతనితో "ఈ రోజు నీవు రాజమండ్రి వెళుతున్నావు కదా? శ్రీ సాయిలీలామృతము. చదువు. నీకు శ్రీ సాయిబాబా స్వప్నదర్శనం ఇస్తారు. సద్గురు అనుగ్రహం వలననే ఇష్టదేవతోపాసన సఫలమవుతుంది" అంటూ 'శ్రీ సాయి లీలామృతం' ఇచ్చారు. ఈ మాటలకు అతనెంతో ఆశ్చర్యపోయాడు. 'తాను గాని, తన మిత్రుడు గాని తాను రాజమండ్రి వెళుతున్న సంగతి మాస్టరుగారికి

చెప్పలేదు. మరి ఆయనకు ఎలా తెలిసింది? అని ఆశ్చర్యం కలిగింది అతనికి.తరువాత పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గర తీసుకున్న శ్రీ సాయి లీలామృతం' గ్రంథాన్ని అతడు రైలులోనే చదివాడు. ఆ రోజు రాత్రే శ్రీ సాయి అతనికి స్వప్న దర్శనమిచ్చి అతని చేయిపట్టుకుని తమతో ఎక్కడికో తీసుకెళుతున్నారు. అది ఉదయం. అందుకని ఆయన నీడ పొడుగ్గావుంది. ఇతడు శ్రీ సాయిబాబా చేయివదిలి ఆయనకంటే ముందుకు నడుస్తూ ఆయనను దాటిపోతుండగా శ్రీ సాయి పరుగున అతనివద్దకు వచ్చి అతనితో, “గురువు నీడను దాటకూడదు!” అంటూ అతనిని ముందుకు వెళ్ళకుండా వారించారు. ఇంతలో అతని స్వప్నం ముగిసింది. తరువాత కొంతకాలానికి అతడు మరల పూజ్యశ్రీ మాస్టరుగారి దర్శనానికి వచ్చాడు. అప్పుడు ఆయన మాటల సందర్భంలో, “గురువు నీడను స్వప్నంలో కూడా దాటకూడదు. చాలా తప్పు. ఒకవేళ మనం అటువంటి ప్రయత్నం చేయబోయినా శ్రీ సాయినాథుడు చేయిపట్టి ఆపుతారు” అన్నారు. ఆయన సర్వజ్ఞత్వానికి అతడెంతో ఆశ్చర్యపోయాడు. పూజ్యశ్రీ మాస్టరుగారు ఎంతటి పుణ్యపురుషులో అతనికి స్పష్టంగా అవగతమైంది.

పూజ్యశ్రీ మాస్టరుగారు చేసిన లీలలు అన్నీ ఇన్నీ కావు. ఇందులో మరొక ప్రత్యేకత ఏమిటంటే తమ గురువైన సాయినాథుడు, పూజ్యశ్రీ మాస్టరుగారు కలసి కొన్ని లీలలను చేయడం. ఇది చాలా అరుదైన విషయం.

1963వ సం॥లో జరిగిన ఆ అద్భుత పవిత్ర సంఘటనను గుర్తుపెట్టుకుని ప్రతి సంవత్సరము ఫిబ్రవరి 8,9 తేదీలలో లక్షలాది సాయిమాస్టర్ భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో వైభవంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలను జరుపుకుంటున్నారు. ఈనాడు కోట్లాది జనం శిరిడీలోని సాయినాథుని దర్శనం కోసం పరుగులు తీస్తున్నారు. సాక్షాత్తూ సాయినాథుని ప్రియపుత్రుడైన పూజ్యశ్రీ మాస్టరుగారి ప్రభంజనం కూడా అలాగే కొనసాగుతున్నది.

1963లో ఆ రోజున ఆ సంఘటనే జరిగివుండకపోతే నేడు మనం ఇలా ఆయనను స్మరించుకునేవారము కాదేమో! ఈనాడు మనం ఇంతటి సుఖశాంతులతో ఉండడానికి కారణభూతులైన శ్రీ సాయి మాస్టర్‌ని ప్రసాదించిన సమర్థ సద్గురువులైన శ్రీ సాయినాథునికి, పూజ్యశ్రీ మాస్టరుగారికి కృతజ్ఞతాపూర్వకమైన న మ సు ్ర మా ం జ లు లు సమర్పించుకుందాము.

పూజ్యశ్రీ మాస్టరుగారు శిరిడీలో అడుగు పెట్టిన ఫిబ్రవరి 8వ తేదీన, ఆత్మానుభూతిని పొందిన ఫిబ్రవరి 9వ తేదీన ఆయనను రోజంతా స్మరించుకునేందుకు మనం శాయశక్తులా ప్రయత్నిద్దాము. అప్పుడే మనము ఆ పుణ్యదినాలను ఆయన ప్రీతికొరకు సంపూర్ణంగా జరుపుకున్నట్లు. ఈ సత్సంకల్పాన్ని సఫలీకృతం చేయమని ఆ సద్గురుద్వయాన్ని మనసారా ప్రార్థిద్దాము. •

రాధాకృష్ణ ఆయీ

09వ పేజీ తరువాయి

గురువుచేసిన యుక్తి జ్ఞాపకమొచ్చింది. అపుడతడు ఆమె ఒడిలో తల పెట్టి కన్నీరు కార్చి ఆమెను బ్రతికించాలన్న సంకల్పంతో గట్టిగా పంచాక్షరి మంత్రం ఉచ్చరించాడు. కాని ఆ మంత్రమెన్నడూ పైకి ఉచ్చరించరాదని అతని గురువు ఆదేశించింది. అంతేగాక 16సం॥లు ఆ మంత్రం జపించిన పుణ్యమంతా ఆయీని బ్రతికించడానికే ధారపోస్తున్నానని సంకల్పించాడు. వెంటనే ఆమెకు స్పృహవచ్చి, “నీవు వెళ్ళి నీపని చూచుకో పో” అన్నది. ఆమె బ్రతికినందుకతడు సంతోషించాడుగాని, తన గురువు ఆజ్ఞ ఉల్లంఘించి ఆ మంత్రం పైకి ఉచ్చరించినందుకు పరితపించాడు. తాను శిరిడీకి రావడం గురుద్రోహమని భయపడడంతో అతనికి మతిస్థిమితం తప్పింది. అతడికి ఒక్కొక్కరే దేవతలు కన్పించసాగారు. అప్పుడు ఆయీ, “ఈ ప్రదర్శన చాలించి, పడుకొని నిద్రపో!” అని కసిరింది. ఇలా రెండు రోజులు గడిచాయి. చివరికి, నల్గురు గురువుల మధ్య అర్థంలేని భయాలతో చిక్కిన అవస్థే మనస్సుకు సంకేతంగా రేగే, ఒకే దారానికి నాల్గుపూవులు కట్టి ఆ చిక్కు విడదీయమని బాబావద్దకు పంపాడు. ఆయన వాటిని వాసనచూచి, “వీటిని శాలవద్దే విడదీయాలి” అన్నారు.

- సశేషం

వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

శ్రీమతి అడిదం వేదవతి

శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.

తొమ్మిదవ ప్రసంగము

శ్లో॥ అభయం సత్త్వసంశుద్ధిః
జ్ఞానయోగ వ్యవస్థితిః ।
దానం దమశ్చ, యజ్ఞశ్చ
స్వాధ్యాయస్తప ఆర్జవమ్ ॥

భావం :- అభయము, అంతఃకరణ పరిశుద్ధంగా వుండడము (అంతఃకరణ పారిశుద్ధ్యము) జ్ఞానం పట్ల, యోగం పట్ల నిలకడగా వుండడము, దానము, దమము, యజ్ఞము, స్వాధ్యాయము, తపము, సారల్యము.

1) అభయమ్ :- భార్యాపిల్లలను విడిచి ఒంటరిగా అరణ్యంలోకి వెళ్ళి యోగాభ్యాసానికి కూర్చున్నప్పుడు 'నా భార్యాబిడ్డల గతి ఏమౌతుంది? అనే భావము, భయము. భగవద్గీతలోనే భగవంతుడు, "యోగక్షేమం వహామ్యహం" అని చెప్పాడు. యోగక్షేమాలను ఆయన భరిస్తాడు. అంతేకాకుండా ప్రపంచంలో మానావమానాలు, నింద, ధనము మొ॥నవి నశిస్తాయేమోననే భావము, గౌరవానికి భంగము కలుగుతుందేమోననే భయము మొ॥న భయాలెన్నో వుంటాయి. ఈ విషయంలో భర్తృహరి ఇలా చెప్పాడు.

శ్లో॥ భోగే రోగభయం కులే చ్యుతిభయం విత్తే నృపాలాద్భయం
మౌనే దైన్యభయం బలే రిపుభయం రూపే జరాయా
భయమ్ ।
శాస్త్రే వాదభయం గుణే ఖలభయం కాయే కృతాన్తాద్భయం
సర్వం వస్తు భయాన్వితం భువి నృణాం
వైరాగ్యమేవాఽభయమ్ ॥

భావం: భోగంలో రోగం కలుగుతుందనే భయము, కులంలో గౌరవము పోతుందేమోననే భయము, ధనంలో రాజులు తీసుకుంటారేమోననే భయము, మౌనంగా వుంటే దీనుడనని అనుకుంటారేమోననే భయము, బలముంటే శత్రువులవలన భయము, రూపము వృద్ధాప్యము వలన పోతుందేమోననే భయము, శాస్త్రజ్ఞానము వాదానికి నిలబడదేమోననే భయము, గుణవంతుడికి దుర్మార్గులనుండి భయము, శరీరానికి యముడినుండి భయము - ఇలా ప్రపంచంలోని అన్ని వస్తువుల విషయంలోనూ మానవుడు భయపడక తప్పదు. వైరాగ్యము మాత్రమే భయరహితమైనది. కాబట్టి వైరాగ్యము చేత ముక్తిని పొందదలచిన వారు భయపడకూడదు.

- సశేషం

మాతృదేవి స్మృతులు

శ్రీ టి. వి. రావు

పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మతల్లి లీలావైభవాన్ని హైదరాబాదులోని నాగోలుకి చెందిన శ్రీ తురగా వెంకటేశ్వర రావు (టి. వీ. రావు) గారు ఈవిధంగా తెలియచేస్తున్నారు---

అది 2013 వ సంవత్సరం. పూజ్యశ్రీ భరద్వాజ మహారాజ్ జన్మదిన వజ్రోత్సవ వేడుకలను అన్ని ప్రాంతాల సత్సంగసభ్యులతో కలిసి నాగోలులో అంగరంగవైభవంగా జరుపుకుంటున్నాము. నాకు ఆహారవిభాగసేవ ప్రసాదించారు. ఆరోజు ఉదయం ఈ వేడుకలలో పాల్గొనడానికి వచ్చినవారందరూ ఉపాహార (టిఫిన్) ప్రసాదం తీసుకుని సత్సంగానికి వెళ్ళారు. పూజ్యశ్రీ అమ్మగారు వచ్చి సత్సంగాన్ని ప్రారంభించారు. ఆ సమయంలో నాకు ఒక ఫోన్ వచ్చింది. వేరే ప్రాంతంనుంచి బస్సులో సత్సంగసభ్యులు వస్తున్నారు. బస్సు చెడిపోవడంవల్ల వారికి ఆలస్యమయ్యిందట. వారందరికీ అల్పాహారం ఏర్పాట్లు చేయవలసి ఉన్నది. సరేనని చెప్పాను. కాసేపటికి వాళ్ళందరూ వచ్చి టిఫిన్ ప్రసాదం తీసుకుని సత్సంగానికి వెళ్లారు. ఈలోగా మరొక ఫోన్ వచ్చింది. ఇంకొక బస్సు కూడా వస్తోందట, వారందరికీ కూడా అల్పాహారం ఏర్పాటు చేయమని! అప్పుడు మాత్రం నాకు ఏమిచేయాలో తోచలేదు. ఎందుకంటే, ఆరోజు మేము చేయించిన రెండురకాల పదార్థాలు అయిపోయాయి. మళ్ళీ వంట చేయడానికి అక్కడ ఎవరూ లేరు. హోటల్ నించి తెప్పించడానికి సమయం మించిపోయింది కనుక టిఫిన్ దొరికే అవకాశం లేదు. పైగా అంత వ్యవధి కూడా లేదు. దాదాపు బస్సు నాగోలులోకి ప్రవేశించింది. అందరూ ఆ రోజు జరిగే వేడుకలలో నిమగ్నమై వున్నారు.

నాకు దిక్కు తోచలేదు. దాదాపు 50 మందికి ఆహారం అందించాలి. 'ఇప్పుడేమి చేయాలి?' అనుకుంటూ సత్సంగం కోసం ఏర్పాటు చేసిన గుడారం వైపు చూశాను. పూజ్యశ్రీ అమ్మగారు వేదికపై ఆసీనులై సత్సంగసభ్యులని ఉద్దేశించి అనుగ్రహభాషణం చేస్తున్నారు. నేనున్న ప్రదేశంనుంచి పూజ్యశ్రీ అమ్మగారు నాకు కనిపిస్తున్నారు. వెంటనే, అక్కడినుంచే రెండుచేతులు జోడించి మనస్ఫూర్తిగా నమస్కారం చేసుకుని, 'అమ్మా! ఈ సమస్య నించి మీరే గట్టెక్కించాలి!' అని ప్రార్థించాను. కొన్నినిముషాలకే ఒక ఆవిడ ఒక పెద్ద హాట్ ప్యాక్ లో వేడివేడి టమాటా బాత్ తీసుకొచ్చి నా చేతిలోపెట్టి వెళ్లిపోయారు!! నేను ఆవిడని అంతకుముందు ఎప్పుడూ చూడలేదు. నాకు నోటమాట రాలేదు. ఆలోచించే సమయం కూడా లేకుండా ఆ బస్సులో వచ్చిన సత్సంగసభ్యులందరూ అల్పాహారం చేయటానికి వచ్చారు. వారందరికీ తృప్తిగా వడ్డించాక అప్పుడు తీరికగా జరిగిన సంఘటన తలచుకుంటే ఒళ్ళు పులకరించింది! ఆనందభాష్పాలు పెల్లుబికాయి! 'అన్యథా శరణం నాస్తి!' అనుకోగానే తృటిలో పూజ్యశ్రీ అమ్మగారు ఆపద్బాంధవియై ఆదుకున్నారు. అనునిత్యం మనమధ్యే, మనతోనే వుంటున్న పూజ్యశ్రీ అమ్మగారు నేను కనీవినీ ఎరగని లీలను చేసి, నన్ను ఆశ్చర్యానందాలకి గురిచేశారు. అటువంటి పూజ్యశ్రీ అమ్మగారికి హృదయపూర్వక పాదాభివందనాలు!

ప్రతినెలా పౌర్ణమికి శ్రీ సాయి మంగ భరద్వాజ్ సేవాసంస్థాన్ తరపున గాణ్గాపూరులో జరిగే దత్తభిక్ష సేవకు హైదరాబాదునుంచి కొంతమంది సత్సంగసభ్యులము వెళ్తూవుంటాము. ఎప్పటిలాగే

మిగతా 29వ పేజీలో

మార్గదర్శి

శ్రీ సూర్యప్రకాష్

(విద్యానగర్ కాలేజీలో లెక్చరర్ గా పనిచేసిన వీరు "ఎంతో మేధాసంపన్నులైన మాస్టరుగారితో నా పూర్వజన్మ పుణ్య ఫలితంగా కలిగిన ఎన్నో సంవత్సరాల సాంగత్యంలో నా జీవితం పునీతమయిందన్న ఆనందాన్ని, నా అదృష్టాన్ని ఏమని వర్ణించగలను?" అంటూ వారితో గల అనుబంధాన్ని గురు బంధువులతో పంచుకున్నారు.)

అమ్మగారిని కాన్పుకు గూడూరు తీస్కెళ్ళాల్సి వచ్చింది. అమ్మగారిని తీసుకొని మాస్టార్ గారు, నేను గూడూరులోని సుశీలమ్మ డాక్టర్ గారి దగ్గరకెళ్ళాం, విజయ్ కుమార్ కూడా వున్నాడక్కడ. మేమంతా బయట కూర్చుని ఏదో మాట్లాడుకుంటున్నాం. "మిమ్మల్ని ఒకటడగాలని వుంది సార్" అని "మీ జన్మ రహస్యం ఏమిటండీ?" అని అడిగాను. అప్పుడు "ఈ జన్మగాక, నాకింకా రెండు జన్మలున్నాయి" అని వారి నోటి మీద గుండా వచ్చింది. How best I can do for him అని ఆలోచించేవాడినే తప్ప నా గురించి నేను అడిగేవాడినే కాదు. కానీ ఆరోజు మాత్రం అడిగా "మరి నా విషయం ఏమిటి సార్? నాగతేమిటి. నాజన్మ పరంపర ఏమిటి?" అని స్పష్టంగా అడిగాను. ఆ రోజులలో ఇక్కడి బాబా మందిర నిర్మాణం ఫుల్-స్వింగ్ లో వున్నది. రోజుకు 20 గంటలు ఊపిరి తిప్పకోలేనంతగా పని చెప్పేవారు. "మీరు యిదే స్థాయిలో త్రికరణ శుద్ధిగా ఎలా చేస్తున్నారో అలాగే యింక పది సంవత్సరాలు చేస్తే, చేయగల్గితే మీరు కొన్ని జన్మలు దాటేయగలరండి. అంతవరకు ఈ జన్మల పరంపర తప్పదు. ఎప్పుడో చేసుకొని వుంటారు. ఆ కర్మ ఫలితాన్ని అనుభవించవలసిందే" అని అన్నారు. అయితే కొన్ని జన్మలైంతర్వాతనైనా సాయిని చేరుకోవడానికి దారి చూపించారు. అలా మా శక్తి మించిన లక్ష్యాలను మాకిచ్చేవారు. అప్పుడు మనస్సు ఏకాగ్రత చెంది ఎలాంటి వికారాలు చెందకుండా ఒకే ధ్యాసతో మందిర నిర్మాణం నెక్స్ట్ ఏం చెయ్యాలి? ఏం చెయ్యాలి? అనే తపన వుంటుందన్న మాట. అదీ వారి ఆధ్యాత్మిక స్థాయికి గీటురాయి.

సాయితత్వ ప్రచారమే తన జీవిత ధ్యేయంగా పెట్టుకున్న మాస్టార్ గారు ఎన్నో వ్యయప్రయాసల కోర్చి రచించిన మహత్తర గ్రంథం 'శ్రీ సాయి లీలామృతం'. బాబాగురించి, బాబా వున్నప్పుడే కొన్ని పరిశోధనలు జరిగాయి. వారి పుట్టు పూర్వోత్తరాలేమిటి? వారి చరిత్ర ఏమిటి? అన్న అంశాల పై రిసెర్చ్ చేశారు. బాబా గురించిన పరిశోధనా

కార్యక్రమాన్ని ఒక వుద్యమంగా చేపట్టారాయన. "మాస్టారు అంతగా పరిశోధన చేసి తేల్చినదేమంటే బాబాగారు ప్రకటమవటమే పదహారేళ్ళ వాడిగా ప్రకటమయ్యారు. అంతే తప్పితే ఆయన పుట్టుక గురించి ఎవరికి ఏమీ తెలియలేదు. వారి పుట్టుక గురించి వ్రాసినదంతా ఒక కట్టుకథ. ఆయన అయోనిజుడు" అని ఖరాఖండీగా తేల్చి చెప్పారు. ఈ పరిశోధనలో వారు దూరాభారాలను, కష్టనష్టాలను లక్ష్య పెట్టలేదు. ఇంతటి బృహత్తర కార్యాన్ని ఆయన అవధూత స్థితిలో వుండి చేశారని నాకనిపిస్తోంది. అందువల్లనే నాగపూర్ ఆల్ ఇండియా కాన్ఫరెన్సుకు వెళ్ళి 'సాయిబాబా ది మాస్టర్' గ్రంథాన్ని తీసుకొని వెళ్ళి అక్కడి వారికి వివరించి వారి కామెంట్ ని అడిగినప్పుడు "It is research book on Sai. It is an encyclopedia and nobody has done the Sai work to this extent" - అని శ్లాఘించారు. అలాగే సైన్సు పరంగా, ఆధ్యాత్మికతను నిరూపించే ఆర్టికల్స్ మాస్టారు గారు ఎన్నో వ్రాసారు. ఒకసారి నేను, మాస్టారు కలిసి తిరుపతి ఎస్.వి.యూనివర్శిటీలోని ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ కెళ్ళి ఆర్టికల్స్ ఫిజిక్స్ ప్రొఫెసర్స్ కిచ్చి ఏమైనా కరెక్షన్స్ చేయాల్సి వుంటే చేయమన్నారు. అప్పుడు వారు మీరు వ్రాసినదంతా కరెక్టే. ఇంతవరకు ఎవరూ ఇంత వివరణను ఇవ్వలేదు" అని అన్నారు. అటువంటిది వారి పరిజ్ఞానం.

ఆయన పుస్తకాలను చాల ఉధృతంగా చదివేవారు. అది, ఇది అని లేదు, అన్ని సబ్జెక్ట్ గురించి చదివేవారు. అవసరమైనప్పుడు నిస్సందేహంగా కోట్ చేసేవారు. వారి జ్ఞాపకశక్తి చాలా ఆశ్చర్యకరంగా వుంటుంది. అంత సూక్ష్మగ్రాహి. ఏది చెప్పినా చాలా అథారిటేటివ్ గా వుండేది. వారికి చాలా సునిశిత, విమర్శనాత్మక దృష్టి వుండేది. మనమందరం ఆహారానికి ఎక్కువ ప్రాముఖ్యత నిస్తాం. కాని ఆయన ఆహారం తీసుకునేటప్పుడు కూడా ప్రత్యేకమైన రుచి లేకుండా అన్నము, కూరగాయలు అన్నింటినీ ఒకే గిన్నెలో పెట్టి ఉడికించేవారు. ఉప్పు, కారం వేసేవారు కాదు. ఒక్కోసారి వేసుకునేవారు. లేకపోతే లేదు. సాధకునికి జిహ్వను కంట్రోల్ చేసుకోవటం ఎంతో అవసరం. కలి ప్రవేశిస్తూనే లింగం (స్త్రీ, పురుషులు) ద్వారా, జిహ్వ ద్వారా ఈ యుగాన్ని జయిస్తానన్నాడు. వాడు వస్తూనే చెప్పాడు: "ఎవడైతే పూజ చేస్తుంటాడో, ఎవడైతే సాధనలో ఉంటాడో, గురుసేవలో వుంటాడో వాడి దగ్గరకు వెళ్ళాలంటేనే నాకు భయం" అన్నాడు. అందువల్ల మనం జిహ్వను ఎప్పుడు కంట్రోల్ చేసుకొంటామో అప్పుడు కలి మన దగ్గరకు రాకుండా పోతాడు. మన ఖర్చు తగ్గుతుంది. సమయం కూడా ఎంతో మిగులుతుంది. ఆ సమయాన్ని మనం ఎన్నో రకాల మంచి పనులకు అంటే సాయిపైన రచనలు, గేయాలు రాయటానికి, పేదలకు ఫ్రీగా బట్టలు కుట్టించివ్వడానికి, హోమియో వైద్యం నేర్చుకొని, వైద్యం చేయటానికి మనం వుపయోగించవచ్చు.

మాస్టర్ గారు ముఖ్యంగా చెప్తుండేవారు "సాయి యొక్క లీలలను పాంప్లెట్ గా రిలీజ్ చేస్తే చాలా మంచిది. క్రిస్టియన్స్ యేసు ప్రవచనాలని ఎలాగైతే ప్రచారం చేస్తారో ఆ విధమైన జీల్ తోటే సాయితత్త్వాన్ని జనంలో వ్యాపింపచేయాలని అనేవారు. ప్రపంచ జనాభాలో చాలా మంది చదువుకోని వారున్నారు గనుక వారికి అర్థమయ్యే రీతిలో వారికి అందించాలి. పూర్వకాలం గ్రామ గ్రామంలో ఏ విధంగా రామాలయాలుండేవో ఆ విధంగా సాయి మందిరాలు వస్తాయని" మాస్టర్ గారు ఎప్పుడో చెప్పే వున్నారు. ఇప్పుడు వారు చెప్పినట్లే సాయి మందిరాలు వెలుస్తున్నాయి. సాధారణంగా మనం దేవాలయాల కెళ్ళి ప్రదక్షిణలు చేస్తాం. టెంకాయలు కొట్టి ప్రసాదం తీసుకొచ్చేస్తాం. అంతే కాని సాయి అంటే ఎవరు? ఆయన తత్త్వమేమిటి? ఆయన ఏమి చేశారు? ఆయన ఏమి చేయమని చెప్పారు? అనేది తెలుసుకోవటానికి మనం ఏం ప్రయత్నించటం లేదు. అందుచేత యువకులకి ముఖ్యంగా కాలేజీ స్టూడెంట్స్ కి, సాయి గురించి సంపూర్ణంగా తెలియజేయాలి. చిన్న చిన్న కథల రూపంలో వారికి తెలియజేస్తే వారి మనస్సులకు హత్తుకుంటుంది. ఒకసారి బాబాలీలలు వాళ్ళ మనస్సుకు హత్తుకుంటే ఇంక వాళ్ళు బాబాని వదలరు. సాయినాథుని లీలల గురించి, తత్త్వాన్ని గురించి సాయంకాలం ఆరతి ముందు ఒక అరగంట చిన్న ప్రవచనంలా చెప్పాలి. ఆరతులను బాబా భీష్మను స్వయంగా అడిగి రాయించుకొన్నారు. అందుచేత

మిగతా 25వ పేజీలో

'ఆధ్యాత్మిక జాగృతి' గ్రంథ పరిచయం

శ్రీ ఎక్కిరాల ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్

(మాతృదేవి పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ 'సాయిబాబా' మాసపత్రికలలో వ్రాసిన వ్యాసము లన్నింటిని కూర్చి 'ఆధ్యాత్మిక జాగృతి' అనే గ్రంథముగా ప్రచురించి, మాతృదేవి ప్రథమ ఆరాధనోత్సవము సందర్భంగా జూన్ 3, 2022న ఆవిష్కరించారు. ఈ గ్రంథాన్ని పరిచయం చేస్తూ శ్రీ ఎక్కిరాల ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ గారు వ్రాసిన 'ముందుమాట' ఈ సంచికలో ప్రచురిస్తున్నాము - ఎడిటర్)

పూజ్యశ్రీ ఎక్కిరాల అలివేలు మంగతాయారుగారిని యావద్భారతావనిలోని సాధుసత్పురుషులందరూ భక్తితో 'శ్రీ అమ్మగారు' అని పిలుస్తారు. వీరు బాల్యం నుంచి ఎంతో గాఢమైన ఆధ్యాత్మిక చింతన కలిగివుండి, కాలాంతరంలో 'శ్రీ జిల్లెళ్ళమూడి అమ్మ' ఆశ్రమంలో ఎన్నో సంవత్సరాలు ఆధ్యాత్మిక సాధన, సేవ, అత్యంత శ్రద్ధతో నిర్వహించారు. శ్రీ సమర్థ సద్గురు సాయినాథుని ఆదేశం మేరకు వీరు సద్గురుమూర్తి అయిన పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిని వివాహం చేసుకొని అశేష భక్త జనావళికి 'గురుపత్ని' గా, 'మాతృదేవి' గా, 'అమ్మ' గా నిలిచారు.

పూజ్యశ్రీ అమ్మగారు గృహ నిర్వహణ, అతిథి అభ్యాగతుల ఆదరణ మొదలైన బాధ్యతలను ఎంతో సమర్థవంతంగా నెఱవేర్చటముతోపాటు శ్రీ భరద్వాజ గురుదేవులకు సహధర్మచారిణిగా వారిని సేవిస్తూ, వారి ఆదేశం మేరకు ఎన్నో సాధనలు చేసి, ఎందరో మహనీయుల దర్శన ఆశీస్సులను, ప్రశంసలను, పొందారు. శ్రీ ఆచార్యుల రచనావ్యాసంగంలోను, ప్రూఫ్-రీడింగు, లీలల సంకలనము మొదలైన అనేక అంశాలలో పాలుపంచుకుంటూ తమ జీవితాన్ని ఆచార్యుల ఆధ్యాత్మిక బోధకు సజీవ తార్కాణంగా నడిపారు పూజ్యశ్రీ అమ్మగారు.

శ్రీ భరద్వాజ గురుదేవుల సమాధి అనంతరం ఆమె ఒకవైపు కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూ, మరోవైపు తమ సాధనను మరింత తీవ్రతరం చేశారు. వీటికి తోడు తమ దర్శనార్థం వచ్చివెళ్ళే ఎందరో ఆర్తులకు, అర్థార్థులకు, జిజ్ఞాసువులకు తమ సలహాలు, బోధలు, సూచనలు, సహాయ సహకారాలు, మార్గదర్శకత్వము అందజేస్తూ; దర్శనము, ఆశీస్సులు ప్రసాదిస్తూ; తమ దివ్యమహిమతో ఐహిక ఆముష్మిక శ్రేయస్సును కలుగజేస్తూ తమ ప్రతిశ్వాస లోకకల్యాణకరమైన సద్గురుసేవగా జీవించారు పూజ్యశ్రీ అమ్మగారు.

దూర ప్రాంతాలలో ఉన్న జిజ్ఞాసువులకు, భక్తులకు తమ ఆధ్యాత్మిక బోధను అందించవలసిందని, అందుకు సాయిబాబా మాసపత్రికలో వ్యాసాలు రచించమని వారిని భక్తులు



ప్రార్థించగా కరుణతో పూజ్యశ్రీ అమ్మగారు అందుకు అంగీకరించి అనేక అద్భుతమైన వ్యాసాలను ప్రసాదించారు.

మొదట పూజ్య ఆచార్యుల ఆదేశానుసారము కొన్ని వ్యాసాలు 1980వ దశకంలోనే పూజ్యశ్రీ అమ్మగారు సాయిబాబా పత్రికకు ప్రసాదించారు. తిరిగి 1990, 2000, 2010 దశకాలలో కూడా ఆధ్యాత్మిక పరిమళాన్ని, జీవనకళని సాధనామయ జీవితాన్ని, ఆధ్యాత్మిక జీవితానికి కీలకమైన సూచనలను, సద్గురువుపట్ల మనకు వుండవలసినన భావనను, పూజ్యశ్రీ భరద్వాజ గురుదేవుల బోధలను ఇలా అనేక అంశాలతో నిండిన మరిన్ని వ్యాసాలను వారు ప్రసాదించారు.

నేటి సామాజిక కాల పరిస్థితిని అనుసరించి సమాజంలో లౌకిక ఆధ్యాత్మిక రంగాలలో ఎంతో సంశయాత్మకమైన సన్నివేశాలు ఎదురవుతున్నాయి. ఇట్టి పరిస్థితుల్లో మనలను సన్మార్గంలో చేయిపట్టి నడిపించగల అద్భుత అనుగ్రహ సముద్రాలు వారి వ్యాసాలు. సాధకులకు, భక్తులకు అనువుగా గ్రంథరూపంలో వాటిని అందజేయాలనే ప్రేరణే ఈ ముద్రణకు కారణం.

పూజ్యశ్రీ అమ్మగారు జూన్ 3, 2021న సమాధి చెందారు. వారి స్వహస్తాలతో మానవాళికి ఇట్టి అద్భుత సందేశాలను అందుకునే అదృష్టం ఇక లేదు. అయినప్పటికీ వారు ప్రసాదించిన ఈ వ్యాసాలను శ్రద్ధతో పఠించి, అనుష్ఠించే వారికి పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ సహిత భరద్వాజ గురుదేవుల ఆశీస్సులు, రక్షణ, మార్గదర్శనము సుప్రతిష్టితమవుతాయి. భక్తులు వారి సాన్నిధ్యాన్ని నేటికీ స్మరణ మాత్రం చేత పొందుతున్నారు. సమాధిస్థితులై ఒంగోలులో నిలిచిన పూజ్య భరద్వాజ గురుదేవులను, ఒంగోలు సమీపంలో సంతనూతలపాడు మండలం, గుమ్మళంపాడు గ్రామ శివారులో సమాధిస్థితులై వున్న అమ్మగారిని సేవించి తరిస్తున్నారు.

ఈ వ్యాసావళి శ్రద్ధతో పఠించేవారికి పూజ్యశ్రీ అమ్మగారి ప్రత్యక్ష సాన్నిధ్యంలో వారి పాదాల చెంత కూర్చుని, వారి బోధలు ఆలకించిన ఫలితం తథ్యం! సాధకులు, సామాన్యులు, ఆర్తులు, అర్థార్థులు, జిజ్ఞాసువులు ఈ వ్యాసావళిని అలా సద్వినియోగం చేసుకొని పూజ్యశ్రీ అలివేలుమంగా సమేత భరద్వాజ గురుదేవుల కృపాశీస్సులు పొందుదురు గాక!

మార్గదర్శి

23వ పేజీ తరువాయి

వాటి ప్రాముఖ్యతను గురించి జనాలకి చెప్పాలి. ఎందుకంటే అవి మహత్తరమైనవి. అవి మహామంత్రాలు, వేదమంత్రాలు. వాటికి భావం రాస్తే అవి మహాభాష్యాలు అవుతాయి. ఆరతుల ప్రాముఖ్యత తెలిస్తే "ఆహా వీటిలో ఇంత మహాత్యం ఉన్నదా!" అని యువతరం బాబాకు దగ్గరవుతుంది. మొదటగా వారి కోరికలు తీరుతాయి. ఆ తర్వాత సాయి దగ్గర వుండటానికి అలవాటు పడతారు. ఒకసారి అలవాటు పడింతర్వాత వాళ్ళిక వెనక్కి వెళ్ళే ప్రశ్నే లేదు. మాస్టారు గారు విద్యానగర్‌లో సాయి మందిరాన్ని స్థాపించడానికి అదే కారణం. ఎన్నో రకాల విద్యార్థులు కొన్ని వేల మంది ప్రతి సం||ము వస్తూ వుంటారు, వెళ్తూ వుంటారు. వాళ్ళ ఇళ్ళకు వెళ్తూ, వెళ్తూ సాయి సాంప్రదాయాన్ని తీసుకెళతారు. వారి వల్ల వారి తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు ప్రభావితం చేయబడతారు. ఆ విధంగా సాయితత్వ ప్రచారం విస్తృతంగా జరుగుతుంది. అలా వారికి హారతులు నేర్పితే వారి కాలం నుండి ఒక అరగంట లాక్కునట్లే. ఇందువల్ల వాళ్ళకు మనమేమీ శిక్ష వేయడంలేదు. వాళ్ళను డబ్బు అడగడం లేదు. వాళ్ళకు మంచి జరగాలని, బాగుపడాలన్నదే మన వుద్దేశం. ఈ సేవ అన్నింటికంటే విలువైనది. ఆ తర్వాత వారు బాబా ఫోల్డ్ నుండి బయటకెళ్ళరు.

- సశేషం

ద్వారకామాయి అనుభవమండపము

ఒక భక్తురాలు, నెల్లూరు

భక్తులను ఆకర్షించడంలో బాబా విచిత్రమైన పద్ధతులలో సంఘటనలు జరిపిస్తారు. అలాంటివే నాకు జరిగినవి.

నా వివాహానికి ముందు మా పుట్టింటిలో ప్రతి గురువారం బాబాను పూజించేవాళ్ళం. మాకు పెళ్ళయిన తరువాత ఆ అవకాశం లేకుండా పోయింది. కారణం నా భర్త. ఆయన ఒక విధమైన మూర్ఖత్వముతో ఉండేవారు. నన్ను శారీరకంగా, మానసికంగా చాలా బాధలు పెట్టేవారు ఆయన. ఒకరోజు అనుకోకుండా మా ఇంటికి బైండింగ్ వర్క్ కోసం సాయిబాబా చరిత్ర పుస్తకం వచ్చింది. అప్పుడు కొన్ని పేజీలు చదివే అవకాశం వచ్చింది. మాకు ప్రక్క వీధిలోని సాయి భక్తుల కుటుంబం ద్వారా మరలా ఆ పుస్తకం నేను చదివే భాగ్యం లభించింది. ఆ విధంగా బాబా చరిత్ర 3 సార్లు, వెంకయ్య స్వామివారి చరిత్ర 2 సార్లు గురుచరిత్ర ఒకసారి చదివాను. ఒకరోజు నేను బాబా విభూతిని నీళ్ళలో కలిపి ఆ తీర్థం ఆయనకిచ్చాను. అప్పటినుంచి ఆయన మారిపోవడమే కాకుండా బాబాను పూజించడానికి ఎంతో తోడ్పడుచున్నారు.

బాబా పిలిస్తే నాకు పలికిన సంఘటనలలో ముఖ్యమైనది. ఆ రోజు సాయిబాబా చరిత్ర పారాయణ చేసి ముగించినరోజు. ఆ రోజే మా వీధిలో వెళ్తూంటే ఒక కుక్క వచ్చి నా కాలు పట్టుకుంది. (ఆ కుక్క దాదాపుగా ఎంతో మందిని కరిచింది. అలానే ఇంక నన్నూ కరిచే వుండేది) అప్పుడు నేను 'బాబా!' 'బాబా!' అని అరిచాను. అలా అరవగానే ఆ కుక్క నా కాలు వదిలేసి నాకు కొద్దిదూరంగా పోయి నిర్లిప్తంగా కూర్చుని నావైపు చూస్తూ ఉండిపోయింది. బాబాను తలచుకోగానే ఎప్పుడు కరవకుండా వదలని ఆ కుక్క సహితం నన్ను వదిలేసి దూరంగా వెళ్ళడం, బాబాను తలచుకోగానే అంత విచిత్రం జరగడం గుర్తుకొచ్చినప్పుడల్లా నాకు సంతోషం పొంగిపొర్లుతుంది.

ఒకరోజు మా ఇంటికి వచ్చిన చుట్టాలబ్బాయికి (3 నెలల బాబు) తీవ్రంగా జబ్బు చేసింది. బాబు తల్లిదండ్రులు కంగారుపడిపోయి డాక్టరువద్దకు వెళ్ళాలనుకుంటుండగా వారిని వారించి "ముందు శిరిడీ యాత్ర నుండి వచ్చిన భక్తులు ఇచ్చిన విభూతిని వాడదాము. తప్పకుండా నయమవుతుంది తగ్గకపోతే డాక్టరు దగ్గరకు పోదాము" అని వారికి నమ్మకం కలిగించి బాబా విభూతిని వాడేను. మేము అనుకున్న టైముకి ముందే అంత తీవ్రమైన జ్వరము తగ్గిపోయి నాకు బాబాపై ఉన్న నమ్మకం, బాబాకు నాపై ఉన్న అనుగ్రహం ఋజువై వారిని కూడా తన భక్తులుగా స్వీకరించారు.

ఈ విధంగా బాబా ఎన్నో విచిత్రమైన సంఘటనలతో ఎంతో మందిని తన భక్తులుగా మార్చుతూ ఎంతో మందికి తన ఆశీర్వాదాలు అందిస్తున్న విషయం ఊహకొస్తేనే ఎంతో ఆనందంగా ఉంటుంది.•

ఆచార్యుని అద్భుత లీలలు

_శ్రీమతి అంజని, ఒంగోలు_

పూజ్యశ్రీ భరద్వాజ మహారాజ్ లీలావైభవాన్ని ఒంగోలుకి చెందిన శ్రీమతి అంజనిగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు.

1987-88 లో పూజ్యశ్రీ మాస్టరుగారితో మా కుటుంబానికి పరిచయ భాగ్యం కలిగింది. పూజ్యశ్రీ మాస్టరుగారు శ్రీమతి సుబ్బలక్ష్మిగారి ఇంట్లో వుండేవారు. అదే వీధిలో చివర మా కిరాణాకొట్టు వుండేది. మా నాన్నగారి పేరు అయ్యప్పగారు. పూజ్యశ్రీ మాస్టరుగారి ఇంట్లోకి కావలసిన సరుకులు మా కొట్లో తీసుకునేవారు. అలా లక్ష్మక్క పరిచయం అయ్యారు. అయితే అప్పటికి మా వ్యాపారం చాలా నష్టాలతో నడుస్తోంది. ఆ విషయం లక్ష్మక్కకి తెలిసి, "ఈ సందు చివరలోనే మా గురువుగారి ఇల్లు. వారిని కలవండి" అని చెప్పారు. మాకు గురు సాంప్రదాయం అస్సలు తెలియదు. కానీ వారానికి ఒకసారి జరిగే సత్సంగానికి మా కుటుంబం అంతా హాజరవుతూ వుండేవాళ్ళం. అలా పరిచయం పెరిగాక, ఒకరోజు మా సమస్య పూజ్యశ్రీ మాస్టరుగారికి చెప్పుకున్నాము. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు నాన్నని, శ్రీ గురుచరిత్ర, శ్రీ సాయిలీలామృతం గ్రంథాలు పారాయణ చెయ్యమన్నారు. అప్పుడు నాన్న, "నేను చదవలేనండి. ఏదైనా పుస్తకం గాని, పేపర్ గాని చదివితే నాకు కళ్ళమ్మట నీళ్లు కారతాయి" అని చెప్పారు. "అయినాసరే, నెమ్మది నెమ్మదిగా, ఒకొక్క పేరా అయినా చదువుతూ అలవాటు చేసుకోండి" అని చెప్పారు. మా నాన్నగారు అలాగే నెమ్మదిగా అలవాటు చేసుకున్నారు. కొన్నాళ్ళకి ఏ సమస్య లేకుండా, పారాయణ చేసుకునేవారు. మా ఇంట్లో అందరికి పారాయణ చేసుకోవడం అలవాటయ్యింది.

వ్యాపారం మెరుగవుతుందేమోనని మా నాన్నగారు మా కొట్టుని రెండు మూడు చోట్లకి మార్చారు. అయినా ప్రయోజనం లేకపోయింది. ఒకరోజు పూజ్యశ్రీ మాస్టరుగారు మా నాన్నగారితో, "మీరు ఏదైనా షాప్ లో గుమస్తాగా జాయిన్ అవ్వండి" అని చెప్పారు. అది మా నాన్నకి చాలా బాధాకరమైన విషయం. ఎందుకంటే మా సొంత ఊరులో (రావినూతల) మా తాతగారు వాళ్ళు, చుట్టుపక్కల పది ఊర్లలో కొట్లకి కిరాణా పంపించేవారు. అప్పట్లో సంక్రాతి పండుగ వస్తే నాన్న లారీలలో సరుకు తెప్పించేవారు. అంత పెద్ద వ్యాపారం మాది. ఒంగోలులో ఏ కొట్టులో గుమాస్తాగా చేరినా, అది మేము సప్లై చేసే కొట్టు అయివుంటుంది. అది నాన్నకి చాలా అవమానమనిపించి చేరలేనని పుజ్యశ్రీ మాస్టరుగారితో చెప్పారు. "పోనీ ఒక పని చెయ్యండి. మీ పెద్దమ్మాయి, మీరు మన ప్రెస్ లో చేరండి" అన్నారు. నేను అప్పుడే ఇంటర్ పూర్తిచేశాను. "నాకు ప్రెస్ వర్క్ రాదు మాస్టరుగారు" అని నేనంటే, "ఫరవాలేదమ్మా! నేర్చుకుంటే అదే వస్తుంది" అన్నారు. ఇంటికి వచ్చాక అమ్మతో ఈ విషయం చెప్తే, "ఆయన మనలాంటి వారు కాదు, వారు చెప్పినట్లు నడచుకుంటే మనజీవితాలు హాయిగా వుంటాయి" అని చెప్పి, నన్ను ప్రెస్ కి వెళ్ళమని చెప్పింది. మా అమ్మకి పూజ్యశ్రీ మాస్టరుగారు అంటే భగవంతుడు అన్న భావం వుండేది.

ఇక అమ్మ, పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పారు కనక నేను ప్రెస్ లో చేరాను. చేరిన రోజే, పనంతా నేర్చేసుకున్నాను. అందరూ ఆశ్చర్యపోయారు. నాకది పూజ్యశ్రీ మాస్టరుగారి దయ అనిపించింది. అన్ని రకాల అంటే ఇంగ్లీష్, తెలుగు కంపోజింగ్ నేర్చుకున్నాను. తరువాత టైపింగ్ కూడా నేర్చుకున్నాను. ప్రతిరోజూ ప్రెస్

కి వెళ్ళేటప్పుడు, ముందు పూజ్యశ్రీ మాస్టరుగారి ఇంటికి వెళ్లి, ప్రెస్ తాళాలు తీసుకుని పూజ్యశ్రీ మాస్టరుగారికి నమస్కారం చేసుకుని, ఊది తీసుకుని వెళ్లేదాన్ని. అప్పుడు నాకు ప్రసాదం పెట్టేవారు. ప్రసాదం అందరికి పెట్టి తినాలన్న భావంతో, ఆ ప్రసాదం రోజూ అందరికి పెట్టి తినేదానిని. ఒకరోజు పూజ్యశ్రీ మాస్టరుగారు, "ఆ ప్రసాదం నువ్వొక్కదానివే తిను" అని చెప్పారు. నేను అందరికి పెట్టి తింటున్న సంగతి తెలిసిపోయిందే అని నేను ఆశ్చర్యపోయాను! నాకు డిగ్రీ చదవాలని అనిపించేది. ఆ విషయం మాస్టరుగారితో చెప్తే, "దానిదేముందమ్మా, ప్రైవేట్ గా కడుదువుగాని" అన్నారు. ఇలా కట్టవచ్చని మా ఇంట్లో ఎవరికి తెలియదు. పూజ్యశ్రీ మాస్టరుగారే అప్లికేషన్ తెప్పించి డిగ్రీ కి కట్టించారు.

1989 వ సంవత్సరం మార్చి నెలలో, పూజ్యశ్రీ మాస్టరుగారు గుడిలోకి బాబా విగ్రహం తేవడం కోసం జైపూర్ వెళ్లారు. అప్పుడు నేను పరీక్షలకి చదువుకుందామని కొన్ని రోజులు ప్రెస్ కి వెళ్ళలేదు. పూజ్యశ్రీ మాస్టరుగారు తిరిగి వచ్చాక, నన్ను పిలిపించి, "పరీక్షలకి ఎప్పుడైనా చదువుకోవచ్చు, ప్రెస్ కి వెళ్ళాక పోతే ఎలా?" అని కోప్పడ్డారు. పూజ్యశ్రీ మాస్టరుగారు ఆ మాత్రం కోప్పడటం కూడా నేనెప్పుడూ చూడలేదు. మర్నాటి నించి నేను ప్రెస్ కి వెళ్ళిపోయాను.

ఏప్రిల్ 11 వ తేదీ, ప్రెస్ కి వెడుతూ తాళాల కోసం పూజ్యశ్రీ మాస్టరుగారి ఇంటికి వెళ్లాను. అప్పుడు నేను మెన్సెస్ అవడం వల్ల, ఎప్పటిలా హాలు లోనించి కాకుండా పక్క సందులోంచి వెళ్లాను. తీరా తాళాలు తీసుకుని బైటికి వచ్చాక, చాలా బలంగా పూజ్యశ్రీ మాస్టరుగారికి నమస్కారం చేసుకోవాలనిపించింది. ఇదివరకు అలాంటి సమయంలో నేను లోపలికి వెళ్లి నమస్కారం చేసుకునేదాన్ని కాదు. ఈసారి లోపలి వెళ్లి నమస్కారం చేసుకోగానే, "అమ్మా! రేపటినించి ప్రెస్ కి రావద్దు, పరీక్షలు కదా, చదువుకో" అని చెప్పారు. సరేనని చెప్పి బైటికి వచ్చాను. పూజ్యశ్రీ మాస్టరుగారు నాతో అన్నమాటలు చాలా ఆశ్చర్యమనిపించాయి. అంతకు ముందేమో, పరీక్షలకన్నా ప్రెస్ లో పని చాలా ముఖ్యం అన్నారు. ఇప్పుడేమో ప్రెస్ కి రావక్కరలేదు చదువుకో అంటున్నారు, అనుకుంటూ ప్రెస్ కి చేరాను. కానీ కాలాంతరంలో తెలిసింది, వారి మాటలకి అర్థం!!

మర్నాడు (12-4-1989) నాన్నగారు, ఇంకొంతమంది కలిసి ఉదయం 7-30 గం. కి పూజ్యశ్రీ మాస్టరుగారి ఇంటికి వెళ్లి అక్కల్కోట స్వామి పాదుకలు బాబా గుడికి తీసుకెళ్లారు. ఇంటికి వచ్చి టిఫిన్ చేస్తుంటే, తెలిసిన వాళ్ళు వచ్చి పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధి అయ్యారని చెప్పారు. మా నాన్న ఆయన్ని కోప్పడ్డారు, "ఏమైనా తెలిసి మాట్లాడుతున్నావా? ఇందాకే కదా మాస్టరుగారిని చూసాను" అన్నారు. "లేదండి నిజమే చెప్తున్నాను" అన్నాడతను.నాన్నవెంటనేబయలుదేరి వెళ్లారు. నేను వెళ్లకూడదని, ఇంట్లోనే వుండిపోయాను. కానీ ఆ రోజంతా ఏడుస్తూనే వున్నాను. ఆ రాత్రి పూజ్యశ్రీ మాస్టరుగారు కలలోకొచ్చారు. ముందు గదిలో పూజ్యశ్రీ మాస్టరుగారు నిద్రపోతున్నట్లు పడుకున్నారు. నేను బాగా ఏడుస్తున్నాను. వెనక గదిలో కూర్చున్నాను. నన్ను పిలిచి ఊదీ పెట్టి, కొన్ని పుస్తకాలు, డబ్బులు యిచ్చి, "నేనెక్కడికి వెళ్ళలేదు, ఏడవకూడదు" అని చెప్పారు. మర్నాడు తెలియకుండానే నాకు మానసికంగా చాలా ధైర్యం వచ్చింది. పూజ్యశ్రీ మాస్టరుగారు మనతోనే వున్నారనిపించింది.

1991 లో నా పెళ్లి అయ్యింది. అప్పటివరకు ప్రెస్ కి వెడుతుండేదాన్ని. నా పెళ్లి పత్రిక నేనే కంపోజ్ చేసుకున్నాను, పూజ్యశ్రీ మాస్టరుగారి ప్రెస్ లో!! నా పెళ్లయ్యాక ఇక తప్పని పరిస్థితిలో మా నాన్న వేరేవాళ్ళ షాపులో గుమస్తాగా చేరారు. తరవాత నెమ్మదిగా పుంజుకుని, మళ్ళీ సొంతంగా వ్యాపారం చేసుకుని పూర్వ వైభవాన్ని సంపాదించుకున్నారు, పూజ్యశ్రీ మాస్టరుగారి దయవల్ల.

పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధి చెందిన కొత్తలో, నాకు స్వప్నంలో సమాధి మందిరంలో పూజ్యశ్రీ మాస్టరుగారు పద్మాసనం వేసుకుని కూర్చుని (నిజానికి వారిని పడుకోపెట్టి సమాధి చేశారు) అందరిని ఆశీర్వదిస్తున్నట్లుగా కనిపించారు. అంటే వారు నిత్యసత్యులని తెలియచేసారు. అలా రెండుసార్లు దర్శనం యిచ్చారు. నాకేదైనా సమస్య వస్తే, సమాధి మందిరానికి వెళ్లి చెప్పుకుంటే పూజ్యశ్రీ మాస్టరుగారు పరిష్కరిస్తారు. అది నాకే కాక, అక్కడికి వచ్చేవాళ్ళందరి అనుభవం.

ఒకసారి స్వప్నంలో వారికి, వారి పటానికి భేదం లేదని తెలిపే లీల ఒకటి చేశారు. ఒకరోజు స్వప్నంలో సుబ్బలక్ష్మి అత్తయ్యగారింట్లో, సత్సంగం ఏర్పాటు

చేశారు. అందరూ పూజ్యశ్రీ అమ్మగారు వస్తున్నారు అని అనుకుంటుంటే, పూజ్యశ్రీ మాస్టరుగారు వచ్చారు. ఆరోజు చాలా మంది వచ్చారు. ఆరోజు సత్సంగం అయ్యాక పూజ్యశ్రీ మాస్టరుగారు, తన మెడలోవున్న పూలమాల తీసి నాకు ఇచ్చారు. చాలా సంతోషం వేసింది. స్వప్నం అయిపొయింది. తరవాత కొన్నాళ్ళకి సుబ్బలక్ష్మి అత్తయ్యగారింట్లో సత్సంగం ఏర్పాటు చేశారు. నేను కూడా వెళ్లాను. సత్సంగం అయ్యాక బయలుదేరుతూ, సుబ్బలక్ష్మత్తయ్యగారికి వెళ్ళొస్తానని చెప్తే, పూజ్యశ్రీ మాస్టరుగారి పటానికి వున్న మాల తీసి నాకు ఇచ్చారు. అప్పుడు కూడా చాలా మందే వున్నారు. నాకు వచ్చిన స్వప్నం నిజమైనందుకు చాలా సంతోషం అనిపించింది. పూజ్యశ్రీ మాస్టరుగారికి వారి పటానికి భేదం లేదనిపించింది.

మాది బట్టల వ్యాపారం. ఒకసారి మా వ్యాపారంలో ఒక కీలకమైన నిర్ణయం తీసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఆ నిర్ణయాన్ని పూజ్యశ్రీ మాస్టరుగారు నాకు స్వప్నంలో సూచించారు. దానికి కట్టుబడి, మేము నిర్ణయం తీసుకున్నాము. ఆ రోజు పూజ్యశ్రీ మాస్టరుగారు అలా సూచించడంవల్ల, ఈరోజు మేమెంతో సుఖంగా వున్నాము. ఇలా ఎన్నెన్నో అనుభవాలను ప్రసాదించిన, నిత్యసత్యులు పూజ్యశ్రీ మాస్టరుగారిని, నా జీవితాంతం చేయిపట్టుకుని నడిపించమని ప్రార్థిస్తూ, కృతజ్ఞతా పూర్వక పాదాభివందనములు సమర్పించుకుంటున్నాను.

జై సాయి మాస్టర్!

మాతృదేవి స్మృతులు

21వ పేజీ తరువాయి

సెప్టెంబర్ నెలలో కూడా ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకుంటున్నాము. రేపు ప్రయాణం అనగా ముందురోజు మధ్యాహ్నం నాకు బాగా ఒళ్లునొప్పులు, నీరసం మొదలయ్యాయి. అప్పుడు హైదరాబాదులో అందరూ తీవ్రమైన జ్వరాలతో బాధపడుతున్నారు. ఇక నాకు కూడా అదే పరిస్థితి కనిపించింది. మర్నాడు సేవకు వెళ్లడం అసాధ్యం అనిపించి, ఈ విషయం నిలయంలోకి కబురుచేయడానికి వెళ్లాను. సేవకు వెళ్లలేకపోతున్నానని మనసులో చాలా బాధగా వుంది. ఇన్నాళ్లుగా ఎప్పుడూ ఇలా జరగలేదు. కానీ ఏమీ చేయలేని పరిస్థితి. నిలయంలో పూజ్యశ్రీ అమ్మగారికి మనసులోనే నమస్కారం చేసుకుని ఇంటికి తిరిగివచ్చి పడుకున్నాను. చాలా ఆశ్చర్యం!!! ఒక అర్ధగంటలో నేను మామూలుగా అయిపోయాను! ఒళ్లునొప్పులు గాని, నీరసం, జ్వరం గానీ మచ్చుకైనా లేకుండా మాయం అయ్యిపోయాయి!! నాకు అది కలా నిజమా అర్థం కాలేదు. పూజ్యశ్రీ అమ్మగారి లీలావైభవానికి ఆనందపరవశుడనై రెట్టించిన ఉత్సాహంతో సేవకు బయలుదేరాను !

ఇలా ఎన్నోసార్లు గాణ్గాపూరు సేవలో పూజ్యశ్రీ అమ్మగారి కృపాకటాక్షాలతో ఎన్నో క్లిష్టపరిస్థితులనుంచి సునాయాసంగా బైటపడడం మాతోపాటు వివిధప్రాంతాలనుంచి వస్తున్న మన సత్సంగసభ్యులందరికీ కూడా ప్రత్యక్షానుభవమే! మనందరమూ 'అమ్మా!' అని పిలుచుకుంటున్నందుకు ఆ తల్లి సహస్రాక్షాలతో వీక్షిస్తారు అన్నది అక్షర సత్యం, అనుభవైకవేద్యం!!

ఓం శ్రీ మాత్రే నమః!

పరిప్రశ్న

06వ పేజీ తరువాయి

ఈ సూక్ష్మాన్ని గుర్తించని మన విద్యావిధానంలో నానాటికీ విద్యా ప్రమాణాలు దిగజారడం చూస్తాము. దీనిని గుర్తించిన వర్ధమాన దేశాలలో నానాటికి విద్యా ప్రమాణాలు పెరగడం చూస్తాము. సాయి చేసినదేదైనా వేదవాక్యమే, ధర్మశాసనమే సుమా! అందుకే లోకాల గురించి సాయి పెద్దగా పట్టించుకోలేదు. మన కర్తవ్యం దృష్ట్యా అది అప్రధానము. కాకుంటే ప్రకృతి యంతటి పైనా శ్రద్ధాభక్తులున్న వారికి గతించిన వారిపట్లా, లోకాల పట్ల లోకాధిపతులపట్లా పూజ్యభావాన్ని వ్యక్తం చేసుకొనే పద్ధతే శ్రాద్ధాది కర్మల లక్ష్యం. అవి ఏదో ఒక రీతిన అన్ని మతాలవారికి వారి వారి దేశ కాల పరిస్థితుల ననుసరించి ఆయా మతాలు చెప్పాయి. జీవితవనరులు తక్కువయిన జాతుల వారి మతాలలో అది క్లుప్తంగా వుంటుంది. వనరులు సమృద్ధిగా వుండే మనదేశంలో అది విపులంగా వుండి సాటివారిని భోజనదానాదులతో తృప్తి పరచేదిగా వుంటుంది. వీటి విషయం నేను వెనుకొక పరిప్రశ్నలో చర్చించాను.

పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

SRI GURUPADUKA PUBLICATIONS, C/o.SRI MANGA BHARADWAJA TRUST

Regd.Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad-68.
Phone: +91 - 74160 41550

Branch Office : Kondaiah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh.
Phone:08592 233271

Send DD in favour of **"Sri Manga Bharadwaja Trust (Publications)", payable at Hyderabad or Ongole.**

శ్రీ సాయి లీలామృతం-శ్రీ గురు చరిత్ర (Bound)	450-00
శ్రీ సాయి లీలామృతం	99-00
శ్రీ గురు చరిత్ర	99-00
శ్రీ సాయి సన్నిధి	120-00
శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు	125-00
శ్రీ సాయినాథ ప్రభోధామృతము	80-00
సాయినాథ పూజ	40-00
సాయినాథ స్తవనమంజరి	10-00
శిరిడి ఆరతులు	15-00
సాయిబాబాను సేవించడమెందుకు	10-00
సత్సంగము - భజన	5-00
శిరిడి క్షేత్ర సందర్శనము	40-00
విజ్ఞాన వీచికలు	99-00
పరిప్రశ్న	99-00
మతమెందుకు?	20-00
ఏది నిజం?	25-00
ధ్యానయోగ సర్వస్వం	99-00
బుద్ధధ్యాన హృదయం	49-00
దత్తావతార మహత్త్వం	75-00
సంహితాయన గురు ద్విసాహస్రి	125-00
పురుషసూక్త రహస్యం	40-00
సాయిసూక్తి - ఆచార్యవాణి	10-00
శ్రీ పాకలపాటి గురువుగారు	49-00
అవధూత శ్రీ చీరాలస్వామి	49-00
అవధూత శ్రీ వెంకయ్యస్వామి	70-00
శ్రీ ఆనందమాయి అమ్మ	49-00
టిబెట్ యోగి మిలారేపా చరిత్ర	80-00
శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర	49-00
స్వామి సమర్థ (అక్కల్కోట స్వామి)	49-00
మనము - మన సంస్కృతి	70-00

ఇతర ప్రచురణలు

మహాత్ముల ముద్దుబిడ్డడు	120-00
అవధూత చివటం అమ్మ	70-00
శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర	70-00
శ్రీ సాయి మాస్టర్ స్మృతులు - పార్ట్-1	125-00
మరో నందదీపం	80-00
ఆచార్య అమృత లేఖావళి	40-00
భగవాన్ శ్రీ భరద్వాజ	175-00
బాలల శ్రీ సాయి లీలామృతము	25-00
మహాపురుషుడు	50-00
శ్రీ సాయి మాస్టర్ స్మృతులు - పార్ట్-2	125-00
బాలల శ్రీ సాయి సన్నిధి	50-00
బాలల శ్రీ గురు చరిత్ర	50-00
శ్రీ సాయి మాస్టర్ నిత్యసత్య వ్రతము	15-00
మాష్టారు అమృత వాక్కులు	100-00

BOOKS IN ENGLISH

Sai Baba the Master	175-00
Sree Guru Charitra	99-00
Supreme Master (Swami Samartha)	99-00
Sai Baba of Shiridi and His Teachings	99-00
Life and Teachings of Hazarat Tajuddin Baba	99-00
Children's Sai Baba the Master	60-00

BOOKS IN OTHER LANGUAGES

Sadguru Sai Baba (Hindi)	150-00
Sai Leelamrutham (Kannada)	150-00
Sai Baba Jeevitha Charitham (Malayalam)	220-00
Sai Baba Leelamrutham (Tamil)	175-00
Sri Guru Charitra (Hindi)	99-00
Swami Samartha (Kannada)	50-00
Sri Guru Charitra (Kannada)	99-00
Shiridi Aarathi (Tamil)	15-00
Stavana Manjari (Tamil)	10-00
Tibet Yogi Milarepa Jeevitha Charitra (Kannada)	55-00
Sri Sainath Prabodhamruthamu (Kannada)	65-00
Sai Sannidhi (Kannada)	120-00
Sri Guru Charitra (Malayalam)	150-00
Sri Guru Charitra (Oriya)	150-00

మాతృదేవి పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ ప్రథమ ఆరాధనామహోత్సవ వేడుకలు ఒంగోలు సమీపంలోని సంతనూతలపాడు మండలం గుమ్మళంపాడు గ్రామ శివారులో వున్న మాతృదేవి దివ్యసన్నిధిలో జూన్ నెల 2, 3, 4, 5 తేదీలలో ఘనంగా జరిగాయి.

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,
Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2021-2023, Regd.No. 37926/83.

పూజ్యశ్రీ అమ్మగారు సాయిబాబా పత్రిక కోసం వ్రాసిన వ్యాసము లన్నిటిని కూర్చి శ్రీ గురుపాదుకా పబ్లికేషన్స్ వారు 'ఆధ్యాత్మిక జాగృతి' అనే గ్రంథంగా ప్రచురించారు. ఈ గ్రంథాన్ని మాతృదేవి ప్రథమ ఆరాధనామహోత్సవ సందర్భంగా జూన్ 3, 2022 తేదీన గుమ్మళంపాడు మాతృదేవి దివ్యసన్నిధిలో గురుపుత్రిక శ్రీమతి వేదమ్మ, శ్రీ శ్రీకాంత్ దంపతులు ఆవిష్కరించారు.

IF UNDELIVERED, PLEASE RETURN TO: SRI MANGA BHARADWAJA TRUST, KONDAIAH BUNK STREET, KOTHAPETA, ONGOLE, PRAKASAM DT., A.P. - 523002.